కళకాలం..!






శిల్పకళాశోభితం... శ్రీరామభద్రాలయం

● యోగముద్రలో దర్శనమిస్తున్న సీతారాములు ● నేటి నుంచి శ్రీరామనవమి వేడుకలు

పెనుకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): టెంపుల్‌టౌన్‌గా ప్రసిద్ధిగాంచిన పెనుకొండలో శ్రీరామభద్రాలయం నవమి వేడుకలకు ముస్తాబయ్యింది. ఈ ఆలయంలోని సీతా, రామ, లక్ష్మణ, హనుమంతు విగ్రహాలు యోగముద్రలో దర్శనమిస్తున్నాయి. ఆలయంలో శిల్పకళ భక్తులను ఎంతగానో ఆకట్టుకుంటుంది.

ఆలయ నిర్మాణం

శ్రీరామభద్రాలయాన్ని తూర్పు ముఖంగా క్రీ.శ.1550లో నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి. గర్భగుడి, మహామండపం, అర్ధ మండపం, కల్యాణమండపాలను రాతి స్తంభాలు, గోడలతో నిర్మించారు. మహామండపాన్ని 16రాతి స్తంభాలు, అర్ధ మండపాన్ని 12 స్తంభాలతో నిర్మించారు. ఈ మండపాల్లోని స్తంభాలపై చెక్కిన నాట్యభంగిమలోని దశావతార ఘట్టాలు, పైకప్పుపై చెక్కిన అష్టదళాల పద్మాలు అద్భుతంగా అనిపిస్తాయి. అణువణువునా కళాత్మకత ఉట్టి పడుతుంది. ఆలయ వెలుపల గోడలపై శ్రీమద్‌రామాయణం, శ్రీకృష్ణలీలావిలాసం, భాగవతపు దశమ స్కందం దృశ్య కావ్యాలను చెక్కారు. ధ్వజస్తంభంపై చెక్కిన యోగముద్ర లక్ష్మీనరసింహస్వామి విగ్రహం, గడ్డి మేస్తున్నట్లు, దూడకు పాలిస్తున్నట్లు, నెమరు వేస్తున్నట్లు ఒకే శిల్పంలో చెక్కిన కామధేనువు శిల్పం కళా నైపుణ్యానికి మచ్చు తునకగా నిలుస్తోంది. తాడిపత్రిలో చింతల వెంకటరమణస్వామి ఆలయంలోని శిల్పాలు, ఈ ఆలయంలోని శిల్పాలు ఒకే పోలికలో ఉంటాయి. ఈ ఆలయంలోని శిల్పాలను తాడిపత్రిలోని శిల్పాలను ఒకే కాలంలో, ఒకే శిల్పాచార్యుల ఆధ్వర్యంలో చెక్కి ఉంటారని విశ్లేషకులు పేర్కొంటున్నారు.


మహామండపం


రామభద్రాలయం


అర్ధమండపం



నేటి నుంచి శ్రీరామ నవమి వేడుకలు

ప్రతి ఏడాదిలాగే ఈసారి కూడా శ్రీరామనవమి వేడుకలను ఈ ఆలయంలో ఘనంగా నిర్వహిస్తాం. ఉత్సవాలు ఆదివారం నుంచి ప్రారంభం అవుతాయి. ఈ నెల 14వ తేదీ వరకు నిర్వహిస్తాం. ప్రతిరోజూ ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, సాయంత్రం పూజలు ఉంటాయి. పండగ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం ఘనంగా నిర్వహిస్తాం. భక్తులందరూ పూజా కార్యక్రమంలో విరివిగా పాల్గొనాలి. - **అర్చకులు రామకృష్ణాచార్యులు**

ఆదర్శం... జగ్జీవన్‌రామ్

కలెక్టర్ టీఎస్ చేతన్

జిల్లా వ్యాప్తంగా ఘనంగా జయంతి


జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న కలెక్టర్, ఎస్పీ


చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి సవిత

పుట్టపర్తిటౌన్/రూరల్/ పెనుకొండ టౌన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఆదర్శనీయుడు బాబూ జగ్జీవన్‌రామ్ అని కలెక్టర్ టిఎస్ చేతన్ కొనియాడారు. జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయి ఆరామం ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు ఎస్పీ రత్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ బాబు జగ్జీవన్‌రామ్ కేంద్ర మంత్రివర్గంలో వివిధ శాఖల్లో సుదీర్ఘ కాలం పనిచేయడం ఆయన కార్యదీక్షకు నిదర్శనమన్నారు. కార్మిక, వ్యవసాయ రంగాల్లో విప్లవాత్మక ఆధునిక సంస్కరణలు తెచ్చారన్నారు. జిల్లాలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాల మరమ్మతుల నిమిత్తం రూ.5.61కోట్లు నిధులు మంజూరు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ దేశానికి, సమాజానికి జగ్జీవన్‌రామ్ చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ గంగాధర్, ఆర్డీవో సువర్ణ, డీఆర్‌డీఏ పీడీ రంగయ్య, సాంఘిక సంక్షేమశాఖ అధికారి శివరంగ ప్రసాద్, జాతీయ, మానవహక్కుల కౌన్సిల్ దక్షిణ భారత అధ్యక్షుడు బాసినేని వెంగమేష్‌చౌదరి, నాయకులు, విద్యార్థులున్నారు.

నేటి యువతకు ఆదర్శం

పుట్టపర్తి జిల్లాపోలీసు కార్యాలయంలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలు వేసి ఘనంగా నివాళులు ఆర్పించారు. జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య సమరయోధుడుగా, సంఘసంస్కర్తగా, తొలి దళిత ఉపప్రధానిగా ఆయన దేశానికి చేసిన సేవలు ఎంతో గొప్పవన్నారు. ఆయన బాట నేటి యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శ్రీనివాసులు, స్పెషల్‌బ్రాంచ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

● పెనుకొండలోని టీడీపీ కార్యాలయంలో మంత్రి సవిత ఆధ్వర్యంలో , టీడీపీ శ్రేణులు, దళిత సంఘం నాయకులు జగ్జీవన్‌రామ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. మంత్రి మాట్లాడుతూ పేదల, శ్రామికుల ఆర్థిక సమానత్వ సాధనకు జగ్జీవన్‌రామ్ ఎనలేని కృషి చేశారని కొనియాడారు.

నేటి నుంచి వేమన బ్రహ్మోత్సవాలు

గాండ్లపెంట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కటారుపల్లిలో ఆదివారం నుంచి యోగివేమన బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పూజారులు తెలిపారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకుంటారు. ఈ ఉత్సవాలు నాలుగు రోజులపాటు కన్నులపండువగా సాగుతాయి. 6న మహాశక్తి పూజ, 7న బండ్ల తిరుగుట, పానక పందారం, 8న ఉట్ల తిరునాళ్ల, 9న గొడుగుల మెరవణితో పాటు నాలుగురోజులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.


యోగివేమన సమాధి

30,629 పత్రాల మూల్యాంకనం

కొత్తచెరువు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పదో తరగతి జవాబు పత్రాల మూల్యాంకనం స్థానిక బాలుర ఉన్నతపాఠశాలలో శనివారం కొనసాగింది. ఇందులో 30,629 జవాబు పత్రాలను ఉపాధ్యాయులు మూల్యాంకనం చేశారని డీఈఓ కిష్టప్ప తెలిపారు.

అలరించిన తెలంగాణ భక్తుల నృత్యాలు

పుట్టపర్తి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సంగీత, సాంస్కృతిక కార్యక్రమాలతో తెలంగాణ యువత భక్తులను అలరించింది. ఆ రాష్ట్ర భక్తులు శనివారం ప్రశాంతినిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో జానపద, గిరిజన నృత్యాలను ప్రదర్శించారు. జానపద కళలతో భక్తులను అలరించారు. రాత్రి పట్టణవీధుల్లో సత్యసాయి రథోత్సవం, నగర సంకీర్తన నిర్వహించారు.




నృత్యం చేస్తున్న తెలంగాణ భక్తులు

మారనున్న చదువు

- డిగ్రీలో కొత్త కోర్సులు...! ● ఉద్యోగ కల్పనే ధ్యేయం
- కంపెనీల అవసరాలకు అనుగుణంగా పాఠ్యాంశాలు
- కోర్సు చివరి సంవత్సరంలో ఇంటర్న్‌షిప్
- విధివిధానాలు రూపొందిస్తున్న విద్యాశాఖ



అనంతపురం సెంట్రల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): డిగ్రీలో స్కిల్ బేస్డ్ కోర్సుల రూపకల్పనకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు ప్రారంభించింది. ఇందులో భాగంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక సంస్థల ను గుర్తించి వాటికి అవసరమైనవిధంగా పాఠ్యాంశాలు రూపొందించేం దుకు ప్రణాళికలు రూపొందిస్తోంది. గుర్తించిన సంస్థలతో ముందుగానే ఒప్పందాన్ని కుదుర్చుకుని కళాశాలలకు అనుసంధానం చేయనుంది. ఆ మేరకు కోర్సు చివరి సంవత్సరంలో విద్యార్థులతో ఇంటర్న్‌షిప్ చేయించి అదే సమయంలో నెలకు రూ.20వేల వరకు ఉపకార వేతనం చెల్లించేలా సంబంధిత సంస్థ కళాశాలలతో ఎంఓయూ కుదుర్చుకోవాలి. ఇలా అనేక కోణాల్లో సానుకూల అంశాలను క్రోడీకరించి పకడ్బందీగా అమలు చేసేందుకు డిగ్రీ కళాశాలల ప్రిన్సిపాళ్లతో సమీక్షించి ప్రణాళికలు రూపొందించింది. అందుకు అనుగుణంగా విద్యాశాఖ విధివిధానలను రూపొందిస్తోంది.

గతమంతా గందరగోళం

గడిచిన ఐదేళ్లు విద్యా వ్యవస్థలో గందరగోళాన్ని సృష్టించారు. డిగ్రీలోని మూడు సబ్జెక్టులకు బదులుగా ఒక సబ్జెక్టునే ప్రధానం చేసి, రెండో ప్రాధాన్యంగా మరో సబ్జెక్టును ఎంచుకోండంటూ విద్యార్థుల్లో అయోమ యాన్ని రేకెత్తించారు. హానర్ డిగ్రీ చేసిన విద్యార్థులు పోస్ట్ గ్రాడ్యు యేట్(పీజీ)లో ప్రవేశం పొందేందుకు గైడ్‌లెన్స్ రూపొందించలేదు. మరోవైపు తరగతులు నిర్వహణ, అధ్యాపకుల అడ్జెస్ట్‌మెంట్, టైంటేబుల్ ఇలా ప్రతిది నిబంధనలకు విరుద్ధంగా కొనసాగించారు. వీధుల్లోని కిరాణా కొట్లు, రిపేరీ షాపులు, తోపుడు బండ్ల వ్యాపారాలను సైతం కంపెనీలుగా గుర్తించి వాటిలో ఇంటర్న్‌షిప్ చేయాలని విద్యార్థులకు లిస్ట్ ఇచ్చారు. వీటికి తోడు మూడు నెలలకు ఒక సెమిస్టర్ నిర్వహిస్తేనే ప్రపంచ దేశాలతో పోటీపడతామని కబుర్లు చెప్పారు. చివరికి ఏదీ ఫలితాన్ని ఇవ్వలేదని అధ్యాపక వర్గాలు గుర్తు చేసుకుంటున్నాయి. గతంలో సృష్టించిన గందరగోళం నుంచి బయటపడటానికి నానాకష్టాలు పడాల్సి వస్తోందని వాపోతున్నాయి.

నైపుణ్యానికే జై...

నిర్వీర్యమైన ఉన్నత విద్యావ్యవస్థను నైపుణ్యంతో పునర్నించేలా రాష్ట్ర విద్యాశాఖ ముందుకెళ్తోంది. స్కిల్డ్ బేస్డ్ కోర్సులను ప్రవేశపెట్టి విద్యార్థుల్లో నైపుణ్యమెలకువలు పెంపొందించేలా భవిష్యత్తును నిర్మి స్తోందని కళాశాలల అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. మానవాళికి అవసరమైన ప్రతి వినియోగ వస్తు తయారీ, ముడిసరుకు నుంచి వస్తు ఉత్పత్తి, రవాణా, మార్కెటింగ్, రీ-ప్రొడక్షన్ అన్ని ప్రక్రియలను సద్వినియోగం చేసుకునేందుకు వాటికి అవసరమైన నైపుణ్యాలను అందించేలా కొత్త కోర్సులు రూపొందుతున్నాయని వివరిస్తున్నాయి. కంపెనీలు, కళాశాలలను అనుసంధానం చేసి మార్కెట్, ఇండస్ట్రీయల్ ఓరియంటెడ్ కోర్సులు ప్రవేశపెడతారు. చివరి సంవత్సరంలో పరిశ్రమల్లోకి ఇంటర్న్‌షిప్‌కు వెళ్లే విద్యార్థులకు ఉపకార వేతనం చెల్లిస్తారు. సంస్థను బట్టి నెలకు రూ.5వేల నుంచి రూ.20వేల వరకు ఉపకార వేతనం చెల్లిస్తారు. కచ్చితంగా ఆర్నెళ్లు ఇంటర్న్‌షిప్‌కు వెళ్లాల్సి ఉంటుంది.

అటానమస్, న్యాక్...?

కొత్త కోర్సులు ప్రవేశపెట్టాలంటే అందుకు అవసరమైన మౌలిక సదుపాయాలు కళాశాలలో ఉండాలి. అటానమస్ కళాశాలలా? న్యాక్ ఏ గ్రేడున్న కళాశాలలా? అన్ని కళాశాలలా? అన్న తర్జనభర్జన సాగుతోంది. కోర్సు ప్రవేశపెట్టిన తరువాత అధ్యాపకులకు శిక్షణ ఇవ్వాలి. ప్రాక్టికల్స్‌కు అవసరమైన సదుపాయాలు ఏర్పాటుచేయాలి. అవసరమైన సాంకేతిక సిబ్బందిని నియమించుకోవాలి. పరీక్షల నిర్వహణ, ఎవాల్యుయేషన్, మార్కుల గ్రేడింగ్ తదితర ప్రక్రియలు సమీక్షించుకోవాలి. సంపూర్ణస్థాయిలో వసతులు సమకూర్చుకున్న కళాశాలలో కొత్త కోర్సులు ప్రవేశపెడితే సత్ఫలితాలు వస్తాయని అధ్యాపక వర్గాలు పేర్కొంటున్నాయి.

శుభ పరిణామం



ఉద్యోగ కల్పనే ధ్యేయంగా డిగ్రీలో కొత్త కోర్సులను ప్రవేశపెట్టేందుకు రాష్ట్ర విద్యాశాఖ కసరత్తు ప్రారంభించింది. గత కొన్నేళ్లుగా డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాలు గణనీయంగా తగ్గిపోయాయి. పూర్వ వైభవం సాధించేలా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులకు రూపకల్పన చేసి ప్రవేశపెట్టాలనుకోవడం శుభ పరిణామం. ముఖ్యంగా గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో ఉపయోగపడుతుంది. ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో సంపూర్ణస్థాయి మౌలిక సదుపాయాలున్నాయి. 2014-18వరకు రూసా వంటి నిధులతో ల్యాబ్‌లు ఏర్పాటు చేశారు. అధునాత భవనాలు నిర్మించారు. తగిన అధ్యాపకులున్నారు. కొత్తకోర్సుల ప్రవేశానికి అన్నివిధాలా అనుకూలంగా ఉన్నాయి.

- రామకృష్ణ, ఉరవకొండ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్

ఏ దారైనా అంతే..!

నత్త నడకన ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణం

- ఏళ్ల తరబడి సాగుతున్న పనులు ● ప్రయాణికులకు తప్పని తిప్పలు ● భూసేకరణే అసలు సమస్య
- ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఇదే పరిస్థితి



ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులను కలిపే ఆర్‌అండ్‌బీ రోడ్డు నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఏళ్ల తరబడి పనులు జరుగుతుండటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. భూసేకరణలో అధికారుల అలసత్వంతోనే పనులు నిదానంగా జరుగుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం న్యూటౌన్

భూసేకరణలో జాప్యంతో ముందుకు సాగని పనులు

జిల్లాలో ఆర్‌అండ్‌బీ ద్వారా చేపట్టిన జాతీయ రహదారుల నిర్మాణ పనులకు అవసరానికి అనుగుణంగా నిధులు కేటాయించారు. అయితే కొందరు అధికారుల అలసత్వం, పలు విభాగాల సమన్వయ లోపంతో భూ సేకరణలో జాప్యం జరుగుతోంది. అందుకే పనులు సకాలంలో పూర్తి కావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

కొన్ని ఉదాహరణలు

గోరంట్ల - హిందూపురం ఫోర్‌వే లేన్ 34 కిలోమీటర్ల నిర్మాణాన్ని రెండేళ్ల కిందట రూ.810 కోట్లతో ప్రారంభించారు. ఏళ్ల గడుస్తున్నా ఇప్పటికీ భూసేకరణ పూర్తి కాలేదు.

- తాడిపత్రి బైపాస్ రోడ్డు నిర్మాణానికి రూ.160 కోట్లతో రెండేళ్ల కిందట శ్రీకారం చుట్టారు. పనులు నత్తనడక సాగుతుండటంతో ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని వాహనదారులు వాపోతున్నారు. ఇప్పటి వరకు 65 శాతం పనులు పూర్తి అయినట్లు అధికారులు చెబుతున్నారు. మిగిలిన పనులు పూర్తి కావడానికి ఇంకెన్నేళ్లు పడుతుందోనని పలువురు అసహనం వ్యక్తం చేస్తున్నారు.
- ముదిగుబ్బ - పుట్టపర్తి రహదారి నిర్మాణం పనులు ఇప్పటి వరకూ 76 శాతం పూర్తి చేశారు. ముదిగుబ్బలో ఆర్వోబీ పనులు ప్రారంభిం చాల్సి ఉంది. ఇదే అసలైన సమస్యగా అధికారులు చెబుతున్నారు.
- రాప్తాడు ఆర్వోబీ పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఎప్పుడు పూర్తి చేస్తారో తెలియని పరిస్థితి. ఏడెనిమిదేళ్లు గడిచినా ఇంకా పనులు సాగుతూనే ఉన్నాయి. 1.6 కి.మీ రోడ్డును రూ.98.55 కోట్లతో చేపట్టారు. గతంలో పనులు చేపట్టిన కాంట్రాక్టర్ పూర్తి చేయడానికి ముందుకు రాలేదు. దీంతో టెండర్ రద్దు చేసి, నూతన టెండర్ పిలవనున్నారు. ఎప్పటికి పూర్తి చేస్తారన్నది తెలియాల్సి ఉంది.
- బత్తలపల్లి - ముదిగుబ్బ ఫోర్‌వే లైన్ నిర్మాణంలో భాగంగా అతి కష్టం మీద పనులు పూర్తి చేశారు. రాకపోకలకు అవకాశం కల్పించడంతో స్థానికులతో పాటు ప్రయాణికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నత్తనడకన పనులు

కేంద్ర ప్రభుత్వం ఉమ్మడి జిల్లాకు జాతీయ రహదారుల నిర్మాణానికి కావల్సిన నిధులు కేటాయించింది. నిధుల కేటాయింపు జరిగి కొన్నేళ్లు గడిచినా ఆశించిన స్థాయిలో పనులు జరగడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. చేసిన పనులకు సకాలంలో బిల్లులు చెల్లింపు లేకపోవడం కూడా పనుల జాప్యానికి కారణంగా చెబుతున్నారు. సార్వత్రిక ఎన్నికల ముందు బిల్లులు చెల్లింపులు లేకపోవడంతో పనులు పెండింగ్ పడిపోయాయి. ఎన్నికల తరువాత కూడ దాదాపు 3 నెలలు పాటు అదే తరహాలో జరిగిందన్న ప్రచారం ఉంది.



రాప్తాడు రైల్వే బ్రిడ్జి దుస్థితి..



ఉమ్మడి జిల్లాలో పనులను పరిశీలిస్తే..			
ఎక్కడి నుంచి ఎక్కడికి	దూరం (కి.మీ.)	నిధులు	పనుల పూర్తి శాతం
ముదిగుబ్బ - పుట్టపర్తి	32	రూ.402 కోట్లు	76
పులివెందుల - బి. కొత్తపల్లి	57	రూ.840 కోట్లు	62
పుట్టపర్తి - కోడూరు	47	రూ.1319 కోట్లు	50
తాడిపత్రి బైపాస్ రోడ్డు	38	రూ. 160 కోట్లు	65

వేగవంతం చేస్తాం: సుధాకర్‌రెడ్డి, ఈఈ, ఆర్‌అండ్‌బీ



కొన్ని ప్రాంతాల్లో భూసేకరణలో జాప్యంతో పనులు కొంత ఆలస్యం అవుతున్నాయి. అన్ని విభాగాల అధికారులు సమష్టిగా చర్యలు తీసుకుని, పనులు వేగవంతం చేస్తాం. భూ సేకరణ కార్యక్రమాన్ని వేగవంతం చేశాం. పనులు మరింత వేగవంతం చేసి పూర్తి చేస్తామన్నారు.

- యూడీఐడీ కార్డుతో సేవలు సులభతరం
- దివ్యాంగులకు వరం యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు
- ప్రత్యేక పోర్టల్‌ను ప్రారంభించిన కేంద్ర ప్రభుత్వం
- 21 రకాల సేవలు పొందే అవకాశం

సదరం సమస్యలకు చెక్..!



యూడీఐడీ కార్డు ముందు భాగం... యూడీఐడీ కార్డు వెనుక భాగం

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందించే సంక్షేమ పథకాలు, ఇతరత్రా సేవలకు సదరం స్థానంలో యూడీఐడీ(యూనిక్ డిజేబిలిటీ ఐడెంటిటీ కార్డు)ని ప్రవేశపెట్టారు. గతంలో సదరం సర్టిఫికెట్ కోసం దివ్యాంగులు గ్రామ సచివాలయాలు, మీసేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకుంటే ప్రభుత్వం నిర్దేశించిన వైద్య శిబిరంలో వైద్యులు వైకల్య నిర్ధారణ అనంతరం సర్టిఫికెట్లను జారీ చేసేవారు. ఈ బాధల నుంచి దివ్యాంగులకు విముక్తి కల్పించేందుకు కేంద్రప్రభుత్వం యూడీఐడీ కార్డు అమలుకు శ్రీకారం చుట్టింది. సదరం సర్టిఫికెట్ స్థానంలో యూడీఐడీని పొందేందుకు http://swavlambancard.gov.in వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దీంతో దివ్యాంగులు నేరుగా ఇంటి వద్ద నుంచే ఫోన్, ఇంటర్‌నెట్ సెంటర్, మీ-సేవా కేంద్రాల నుంచి కార్డు కోసం దరఖాస్తు చేసుకొనే వెసులుబాటు కల్పించింది.

మూడు లక్షల మందికి ప్రయోజనం

యూడీఐడీ కార్డు ద్వారా అనేక ప్రయోజనాలున్నాయని విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖాధికారులు చెబుతున్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపు మూడు లక్షల మంది దివ్యాంగులు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా నాలుగు విడతల్లో 30 వేల మందికి ఈ యూడీఐడీ కార్డులను అందజేసినట్లు తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారికి కార్డు ప్రయోజనాలు వివరిస్తున్నామన్నారు. సదరం శిబిరాల కోసం మీ-సేవతో పాటు యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకునే వెసులుబాటు కల్పించింది. దరఖాస్తు చేసుకున్న వారికి సదరం శిబిరాలకు ఎప్పుడు హాజరుకావాలనే సమాచారం ఫోన్ నెంబర్‌కు మెసేజ్‌లు వస్తాయి. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసే సమయంలో ఎలాంటి తప్పులు, అక్షర దోషాలు లేకుండా చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటి వరకూ ఐదు రకాల వైకల్యం ఉన్న వారికే మీ-సేవ ద్వారా సదరం శిబిరాలకు దరఖాస్తు చేసుకునే అవకాశం ఉండేది. అయితే యూడీఐడీ పోర్టల్‌లో 21 రకాల వైకల్యాలను చేర్చారు. తలసేమియా, ఆటిజం, యాసిడ్ బాధితులు, న్యూరో సంబంధిత బాధితులు సదరం శిబిరాల కోసం యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తు చేసుకునే అవకాశాన్ని కల్పించింది. సదరం శిబిరంలో వైకల్యం నిర్ధారణ అయిన అనంతరం సర్టిఫికెట్లను స్మార్ట్‌కార్డు రూపంలో పోస్టల్‌శాఖ ద్వారా నేరుగా దివ్యాంగుల ఇళ్ల చిరునామాకు పంపుతారు. ఈ కార్డు ద్వారా పింఛన్లతో పాటు పలు సంక్షేమ ప్రయోజనాలు దేశవ్యాప్తంగా పొందే అవకాశం ఉంది. ఈ ఐడీ కార్డులను ఆన్‌లైన్ నుంచే డౌన్‌లోడ్ చేసుకునే అవకాశాన్ని కల్పించింది.

దరఖాస్తు ఇలా...

గూగుల్‌లో http://swavlambancard.gov.in పోర్టల్ ఓపెన్ చేయగానే... అప్లయ్ బటన్‌పై క్లిక్ చేసి దరఖాస్తు ప్రక్రియలో సూచించిన అంశాలను పరిశీలించాలి. తరువాత దివ్యాంగుడు తన వ్యక్తిగత వివరాలు నమోదు చేయాలి. రెండో కాలమ్‌లో చిరునామా, గుర్తింపు కార్డు వివరాలు, శాశ్వత చిరునామా పొందుపరచాల్సి ఉంటుంది. మూడో కాలమ్‌లో వైకల్య వివరాలు, నాలుగో కాలమ్‌లో ఎంప్లాయిమెంట్, దివ్యాంగుని గుర్తింపు వివరాలు నమోదు చేయాలి. ఫొటో, వేలిముద్ర లేక సంతకం చేసి అప్‌లోడ్ చేసి సబ్‌మీట్ చేయడంతో దరఖాస్తు ప్రక్రియ పూర్తవుతుంది. వైద్య పరీక్షల అనంతరం వెబ్‌సైట్‌లో అర్జీల స్టేటస్‌ను నిత్యం పరిశీలించుకొనే అవకాశం ఉంటుంది.

యూడీఐడీ తప్పనిసరి



దివ్యాంగులకు రానున్న రోజుల్లో ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు అందాలంటే యూడీఐడీ కార్డు తప్పనిసరి కానుంది. దివ్యాంగులకు ఇప్పటి వరకూ సదరం సర్టిఫికెట్లు జారీ చేసేవారు. ఆ స్థానంలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీ కార్డుల జారీకి ప్రత్యేక పోర్టల్‌ను ఆవిష్కరించింది. ఆధార్ కార్డు తరహాలో కేంద్ర ప్రభుత్వం యూడీఐడీని ప్రవేశపెట్టింది. దివ్యాంగులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని ఈ కార్డు పొందితే ప్రభుత్వం నుంచి సంక్షేమ పథకాలు సులభంగా పొందవచ్చు.

- వినోద్, ఏడీ, విభిన్న ప్రతిభావంతుల సంక్షేమశాఖ



గంజాయి పత్రి..!

తాడిపత్రిలో ఐదురోజుల క్రితం గంజాయి బ్యాచ్ రెచ్చిపోయింది. గంజాయి మత్తులో పరస్పరం దాడులు చేసుకున్నారు. స్థానికుల సమాచారంతో వారిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. అక్కడ పోలీసులపైనే బూతు పురాణం అందుకున్నారు. అంతటితో ఆగకుండా ఏకంగా పోలీసు స్టేషన్‌పైనే రాళ్లు రువ్వాడు గంజాయి మత్తులో ఓ యువకుడు. అక్కడే నిలబడి పోలీసులను దుర్భాషలాడుతున్నా.. వారు చోద్యం చూశారే తప్ప.. చర్యలు తీసుకోలేదు. మద్యం మత్తులో ఉన్నాడంటూ చెప్పుకొచ్చారు. పోలీసు స్టేషన్‌పైనే రాళ్ల దాడి చేస్తున్నా.. అడ్డుకునే వారు లేకపోతే.. పట్టణంలో ప్రజలపై రక్షణ ఎవరు కల్పిస్తారని స్థానికులు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

కృష్ణాపురం జీరో రోడ్డులో మూడునెలల క్రితం కళాశాల విద్యార్థినిని గంజాయి బ్యాచ్ కామెంట్ చేస్తుండగా.. అక్కడే ఉన్న ముగ్గురుబేల్దార్లు మందలించారు. వారిపై కూడా గంజాయి బ్యాచ్ రాళ్లతో దాడులు చేసింది. తీవ్రంగా గాయపడిన బేల్దార్లు చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. నిరుపేదలైన ఆ కుటుంబీకులు వైద్యానికి లక్షల రూపాయలు వెచ్చించలేక దిక్కులు చూస్తున్నారు. ప్రస్తుతం పనిచేయడం చేతకాక, వైద్యఖర్చుల కోసం తెచ్చిన అప్పులు తీర్చలేక ఇబ్బందులు పడుతున్నారు.

భగత్‌సింగ్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న ఇంట్లో గంజాయి బ్యాచ్‌కు సంబంధించిన వీడియో వైరల్ అయింది. వారిని ఇంత వరకు అరెస్టు చేసిన పాపానపోలేదు. పట్టణంలో ఇలాంటి ఘటనలు కోకొల్లలు అని ప్రజలు చర్చించుకుంటున్నారు.

మహమ్మారి మత్తులో యువకుల హల్‌చల్

- దారిన వెళ్లే వారిపై రాళ్ల దాడులు
- బాలికలు, మహిళల పట్ల అసభ్య ప్రవర్తన
- రోడ్లపై ప్రమాదకరమైన బైక్ స్టంట్లు
- బెంబేలెత్తుతున్న ప్రజలు
- పట్టించుకోని పోలీసులు

తాడిపత్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇటీవలిగా గంజాయి విచ్చలవిడిగా దొరుకుతోంది. యువత మహమ్మారి మత్తులో జోగుతున్నారు. బ్యాచ్‌లుగా ఏర్పడి గంజాయి సేవిస్తూ.. ఆ మత్తులో దారిన వెళ్లే వారిపై రాళ్ల దాడులు చేస్తున్నారు. బాలికలు, విద్యార్థినులు, మహిళలను వేధిస్తున్నారు. దీంతో సాయంత్రం వేళల్లో బయటకు రావాలంటేనే జనం జంకుతున్నారు. బిడ్డలను పాఠశాలలు, కళాశాలలకు పంపాలంటే తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. వారే నేరుగా వెళ్లి, వదిలి రావాల్సి వస్తోంది. నందలపాడు, టైలర్స్‌కాలనీ, భగత్‌సింగ్ నగర్, కూరగాయల మార్కెట్, నంద్యాల రోడ్డు, పాతకోట, సుంకులమ్మపాలెం, విజయనగర్ కాలనీ, అంబేడ్కర్‌నగర్, ఏటిగడ్డపాలెం, ఆటోనగర్, టీచర్స్ కాలనీ, యల్లనూరు రోడ్డు, పుట్లూరు రోడ్డు తదితర చోట్ల గంజాయి బ్యాచ్‌లు రెచ్చిపోతున్నాయి. అయినా పోలీసులు చోద్యం చూస్తున్నారన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గంజాయిని అరికట్టడంలో పూర్తిగా విఫలమవుతున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



తాడిపత్రి పట్టణ పోలీసు స్టేషన్

పుట్లూరు రోడ్డు ప్రాంతాల్లో కళాశాలలు ఎక్కువగా ఉండడంతో ఆయా చోట్ల నిత్యం గంజాయి బ్యాచ్‌లు తిరుగుతున్నాయి. గంజాయితోపాటు తెల్లగా పౌడర్ రూపంలో ఉన్న మత్తుపదార్థాన్ని సైతం యువకులు పీల్చుతున్నారు. ఇప్పటికైనా వారి ఆగడాలకు పోలీసులు అడ్డుకట్ట వేయాలని స్థానికులు కోరుతున్నారు.

బెంబేలెత్తిస్తున్న బైక్ స్టంట్లు

పట్టణంలోని యల్లనూరు, సీబీ రోడ్డు, పుట్లూరు రోడ్డు, నంద్యాల రోడ్డు ప్రాంతాల్లో యువకులు బైక్ స్టంట్లు వేస్తూ ప్రజలను భయభ్రాంతులకు లోను చేస్తున్నారు. ఇప్పటికే పలువురు బైక్ స్టంట్లు చేస్తూ కిందపడి గాయాలపాలయ్యారు. ఎవరైనా పోలీసులకు సమాచారమిస్తే.. వారు వచ్చే సమయానికి అక్కడి నుంచి వెళ్లిపోతున్నారు. మరలా గంట తర్వాత వచ్చేసి యథేచ్ఛగా స్టంట్లు కొనసాగిస్తున్నారు. పోలీసులు పట్టించుకోకపోవడంతో వారి ఆగడాలకు హద్దేలేకుండా పోతోంది.

బయటకు వెళ్లాలంటే భయం..

పట్టణంలో ఇటీవలిగా విద్యార్థినులు, మహిళలు ఒంటరిగా బయటకు వెళ్లాలంటేనే భయపడాల్సిన దుస్థితి ఏర్పడింది. కొన్ని వీధుల్లో రాత్రిపూట గంజాయి బ్యాచ్‌లు ద్విచక్రవాహనాల్లో హల్‌చల్ చేస్తున్నాయి. కొన్ని నెలల క్రితం కృష్ణాపురం 6వ రోడ్డులో గంజాయి బ్యాచ్ హల్‌చల్ చేయడంపై ఒక వ్యక్తి.. పోలీసులకు ఫిర్యాదుచేశాడు. దీంతో అతడి ఇంటిపైకి వెళ్లి గంజాయి బ్యాచ్ దాడి చేసిందంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒకటికాదు.. రెండు కాదు.. చెప్పుకుంటూ పోతే చాలాచోట్ల దాడులకు తెగబడుతున్నారు. వారిని దండిస్తే ఎక్కడ తమ మీదకు వస్తారోనని భయపడి అందరూ తమ దారిన తాము వెళ్లిపోతున్నారు. గంజాయి బ్యాచ్‌ల అకృత్యాలతో రాత్రివేళల్లో బయటకు వెళ్లాలంటేనే ఇబ్బందిగా ఉందని కొందరు చర్చించుకుంటున్నారు. విద్యార్థినులను కళాశాలలకు పంపించాలంటే కొందరు తల్లిదండ్రులు భయపడుతున్నారు. కళాశాల వద్దకు వెళ్లి పిల్లలను విడిచిపెట్టి వచ్చే పరిస్థితి ఏర్పడింది. కళాశాల ప్రారంభం, విరామం, మధ్యాహ్న భోజనం, వదిలే సమయాల్లో ఈ బ్యాచ్‌లు ఆయా ప్రాంతాల్లో సంచరిస్తుండడంతో కొందరు తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఈ విషయంపై ఇప్పటికే పలువురు కళాశాలల నిర్వాహకులు.. పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. అయినా పోలీసులు పట్టించుకున్న పాపాన పోలేదు. దీంతో గంజాయి బ్యాచ్‌లు పేట్రేగిపోతున్నాయి. ఇలా అయితే ఎలా అంటూ కొందరు తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యల్లనూరు రోడ్డు, కృష్ణాపురం జీరో రోడ్డు,

ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేశాం



గంజాయి విక్రయాల విషయం మా దృష్టికి వచ్చింది. వాటిపై ఇప్పటికే ప్రత్యేక నిఘా పెట్టాం. ఒక బృందాన్ని కూడా ఏర్పాటు చేశాం. ఎక్కడెక్కడ గంజాయి విక్రయాలు జరుగుతున్నాయి, ఎక్కడి నుంచి తెప్పిస్తున్నారనే వాటిపై దృష్టి పెట్టాం. త్వరలోనే నిందితులను పట్టుకుంటాం.

- రోహిత్‌కుమార్ చౌదరి, ఏఎస్పీ

వక్ఫ్ బిల్లుపై వైసీపీ ద్వంద్వ వైఖరి వీడాలి

టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌస్‌మొద్దీన్

అనంతపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ బిల్లుపై వైసీపీ నాయకులు ద్వంద్వ వైఖరిని వీడాలని టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, అనంతపురం జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొద్దీన్ డిమాండ్ చేశారు. అనంతపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఏపీలో వైసీపీ మత రాజకీయాలు చేస్తోందని మండిపడ్డారు. వక్ఫ్ బిల్లుపై లోక్‌సభలో ఒకలా, రాజ్యసభలో మరోలా వైసీపీ ఎంపీలు వ్యవహరించడం సిగ్గుచేటని అన్నారు. వైఎస్సార్ హయాంలో ఉమ్మడి రాష్ట్రంలో 4 లక్షల ఎకరాల వక్ఫ్ భూములను అన్యాక్రాంతం అయ్యాయని ఆరోపించారు. దేశంలో ముస్లిం మైనార్టీలకు న్యాయం చేసిన ఘనత టీడీపీకే దక్కుతుందని అన్నారు. సీఎం చంద్ర బాబు, మంత్రి నారాలోకేశ్‌తోనే మైనార్టీల అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. సమావేశంలో బాబాఫకృద్దీన్, మహ్మద్‌రఫీ, మౌలా, జాఫర్, షెక్షావలి, మహబూబ్ బాషా, హాజీవలి, మాబు తదితరులు పాల్గొన్నారు.



సంచార చలివేంద్రం



దాహం తీర్చుకుంటున్న నగరవాసులు

వేసవిలో చలివేంద్రాలను ఏర్పాటు చేయడం పరిపాటే. రద్దీ ప్రాంతాల్లో చలువ పందిళ్ల కింద ఇసుక పోసి.. మట్టి కుండల్లో మంచినీటిని అందుబాటులో ఉంచుతారు. పనుల మీద బయటకు వచ్చినవారు అక్కడ దాహం తీర్చుకుంటారు. కానీ అనంతపురం నగరానికి చెందిన ఆటో డ్రైవర్ ఇమామ్.. సంచార చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. తన ఆటోలో చన్నీటి క్యాన్‌ను అందుబాటులో ఉంచారు. ఆ విషయం అందరికీ తెలిసేలా బోర్డు ఏర్పాటు చేశాడు. "ఏడాది క్రితం వేసవిలో నా ఆటోలో నీటి క్యాన్‌ను ఏర్పాటు చేశాను. దాహం వేసినవారు 'తాగొచ్చా..' అని అడుగుతున్నారు. ఆ సందేహం ఎవరికీ రాకూడదనే బోర్డు రాయించాను.." అని ఇమాం తెలిపారు. తన ఆటోలో ప్రయాణించేవారు, స్టాండ్‌లో ఆపినప్పుడు దారిన వెళ్లేవారు దాహం తీర్చుకుంటున్నారని సంతోషం వ్యక్తం చేశారు.

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి



ఆటోలో చల్లని నీటిని అందజేస్తున్న ఇమాం

స్పెషల్ బ్రాంచ్ ప్రక్షాళన..!

- వైసీపీ సేవకులపై వేటుకు సిద్ధం
- వారంలోగా కొత్తవారి నియామకం
- దరఖాస్తులు ఆహ్వానించిన ఎస్పీ రత్న



హిందూపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): నేర నియంత్రణ, నిఘాలో కీలకమైన స్పెషల్ బ్రాంచ్‌ని ప్రక్షాళన చేసేందుకు ఎస్పీ రత్న శ్రీకారం చుట్టారు. కొన్నేళ్ల నుంచి పాతుకుపోయిన, వైసీపీ పాలనలో ఆ పార్టీ నాయకుల కొమ్ముకాసి, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న పలువురికి స్థాన చలనం తప్పేలా లేదు. అవసరాల దృష్ట్యా పలువురిని ఎంపిక చేసి ఎస్‌బీలోకి తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూలేని విధంగా ఒకేసారి మార్చే ప్రక్రియ కొనసాగుతోంది. ఈ క్రమంలో లా అండ్ ఆర్డర్‌లో ఉన్న కొంతమంది హెడ్ కానిస్టేబుళ్లను ఎస్‌బీకి ఎంపిక చేశారు. ఉత్సాహంగా ఉన్నవారు ఎస్‌బీకోసం దరఖాస్తు చేసుకోవాలని కూడా పదిరోజుల క్రితం ఎస్పీ సూచించారు.

వైసీపీ కార్యకర్తల్లా..

వైసీపీ పాలనలో స్పెషల్ బ్రాంచ్ అసలు విధులను పక్కన పెట్టింది. అప్పటి ప్రతిపక్ష నాయకుల కదలికలపై దృష్టి పెట్టేందుకు, వారి ఆర్థిక వనరులను దెబ్బతీసేందుకు పని చేసిందన్న విమర్శలు మూటగట్టుకుంది. ఇలాంటి సమాచారాన్నే మండలాల్లో పనిచేసే స్పెషల్ బ్రాంచ్ సిబ్బంది జిల్లా అధికారులకు చేరవేసేవారు. టీడీపీ నాయకులను ఎలా కేసుల్లో ఇరికించాలి, ఎలా ఇబ్బంది పెట్టాలనే సమాచారాన్నే అప్పటి ఎస్పీ స్థాయి అధికారులు సేకరించారనే ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పెద్ద పెద్ద సంఘటనలు జరిగినా పోలీసులకు ముందస్తు సమాచారం ఉండేది కాదు. ఉదయం లేచినప్పటి నుంచి వైసీపీ సేవలో మునగడమే తప్ప.. నేర నియంత్రణ, నిఘా అంశాల గురించి పట్టించుకోలేదు. వారే ఇప్పటికీ ఎస్‌బీలో ఉన్నారు. కనీసం పక్క సబ్ డివిజన్లకు కూడా పంపలేదు. పాస్‌పోర్ట్ పరిశీలనలో కొంతమంది చేతివాటం ప్రదర్శిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. వీరినీ తప్పిస్తున్నారని తెలిసింది.

ఇవీ విధులు..

స్పెషల్ బ్రాంచ్ విధుల్లో ముఖ్యమైనది నిఘా. రేపటి కార్యక్రమాల వివరాలను ఈ రోజే ఉన్నతాధికారులకు నివేదించాలి. రాజకీయ పార్టీలు, విద్యార్థి సంఘాలు, నేరస్థులపై నిఘా వేసి.. పరిణామాలను తెలియజేయాలి. పాస్‌పోర్ట్ పరిశీలన, పోలీస్ స్టేషన్‌లలో అధికారులు, సిబ్బంది పని తీరు గురించి ఎస్పీకి నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది. వైసీపీ హయాంలో ఈ వ్యవస్థ గాడి తప్పింది. దీంతో అధికారం మారిన తరువాత స్పెషల్‌బ్రాంచ్‌పై ప్రత్యేక దృష్టిసారించారు. ఈ క్రమంలో ఆరోపణలు ఎదుర్కొంటున్నవారిని లా అండర్ ఆర్డర్, ట్రాఫిక్ విధులకు పంపుతున్నారని తెలిసింది. ఈ క్రమంలో ఐదేళ్లపాటు పనిచేసినవారు స్వచ్ఛందంగా బదిలీలకు దరఖాస్తు చేసుకున్నారు. వచ్చేవారం జిల్లా వ్యాప్తంగా ప్రక్షాళన పూర్తి అవుతుందని విశ్వసనీయంగా తెలిసింది.

మొక్కల పెంపకంతోనే
ఎడారి నివారణ

జోధ్‌పూర్‌లో పర్యటిస్తున్న అధికారులు, రైతులు



జోధ్‌పూర్‌లో ఇసుకమేటలను పరిశీలిస్తున్న ఉపాధిహామీ అధికారులు

కణేకల్లు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మొక్కల పెంపకంతోనే మండలంలో ఇసుక మేటల నివారణ సాధ్యమవుతుందని ఉపాధిహామీ పథకం ఏపీఓ సుధాకర్, నాగేపల్లి రైతు వాలం వెంకటేశులు పేర్కొన్నారు. ఇసుకమేటల నివారణ కోసం రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారనే విషయాన్ని తెలుసుకునేందుకు ఇక్కడి రైతులు, అధికారులను రాష్ట్ర ప్రభుత్వం అక్కడికి పంపిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అక్కడి పరిస్థితులను పరిశీలించిన రైతులు, అధికారులు తమ అభిప్రాయాలను వెల్లడించారు. మండలంలోని నాగేపల్లి, తుంబిగనూరు, గరుడచేడు, మీండ్లపల్లి, బిదురకుంతంతో పాటు బొమ్మనహాళ్ మండలంలోని దర్గాహొన్నూరు, కళ్లదేవనహాళ్లిలో ఇసుకమేటలు విస్తరించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఇసుక మేటలలో గోధుమ, సజ్జగింజల మొక్కలతో పాటు ఆర్గానిక్ మొక్కలను పెంచడం వల్ల ఇసుక ఒక చోట నుండి మరో చోటికి రవాణా కాకుండా చెందకుండా ఉన్నట్లు అక్కడి అధికారులు తమకు వివరించినట్లు వారు తెలిపారు. మూడురోజులుగా తాము జోధ్‌పూర్‌లోని దేచు మండలం, భగవాన్‌పుర తదితర ఏరియాలలో పర్యటిస్తూ అక్కడి రైతులు తీసుకుంటున్న చర్యలను గమనించినట్లు తెలిపారు. తమతో పాటు జిల్లా ఉపాధిహామీ పీడీ సలీంబాషా, టెక్నికల్ టీం ఖలందర్, గౌరీశంకర్, రాజేష్ తదితరుల బృందం రెండురోజులుగా జోధ్‌పూర్‌లో పర్యటిస్తున్నట్లు తెలిపారు.

జగన్ చీటీ చినిగింది

- ఉనికి కోసమే ఆయన పాట్లు
- తాగు, సాగునీరు అందిస్తాం
- అన్ని చెరువులను నీటితో నింపుతాం
- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



హంద్రీనీవా కాలువను పరిశీలిస్తున్న మంత్రి

సోమందేపల్లి/పరిగి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జగన్ చీటీ చించివేశారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత ఎద్దేవా చేశారు. మండలకేంద్రానికి సమీపంలోని హంద్రీనీవా కాలువను శనివారం ఆమె పరిశీలించారు. హంద్రీనీవా అధికారులతో మాట్లాడారు. ఆమె మాట్లాడుతూ హంద్రీనీవా ద్వారా తాగు, సాగునీరు అందించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. పెనుకొండ, మడకశిర, హిందూపురం నియోజకవర్గాలకు తాగు, సాగునీటి కష్టాలను తీర్చడానికి హంద్రీనీవా ద్వారా కృష్ణాజలాలను తరలిస్తున్నామ న్నారు. 265చెరువులకు నీరు నింపాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. గడిచిన ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం కాలువ మరమ్మతుల కోసం ఎలాంటి పనులు చేపట్టలేదన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రూ1.2 కోట్లను కాలువ మరమ్మతు లకు విడుదల చేశారన్నారు. సోమందేపల్లి మండలంలో 17చెరువులు పూర్తిగా నింపామన్నారు. కార్యక్రమంలో వెంకటరమణ, నీరుగంటి చంద్ర, సిద్దలింగప్ప, సీసీ హరి పాల్గొన్నారు.

ఉనికి కోసమే..

రాష్ట్రంలో జగన్ ఉనికి కోసమే పరామర్శలకు వస్తున్నాడని మంత్రి సవిత అన్నారు. వైసీపీ పాలనలో జరిగిన రాజకీయ హత్యలు, బాధితులకు న్యాయం చేసి పరామర్శించాలన్నారు. మాజీమంత్రి పరిటాల రవీంద్ర ఎలా చనిపోయారో చర్చకు రావాలన్నారు. వైఎస్ వివేకాను ఎవరు చంపారో చెప్పి చెల్లెలు సునీతను పరామర్శించాలన్నారు. తల్లి విజయమ్మ, చెల్లి షర్మిలను పరామర్శించి జనం ముందుకు రావాలన్నారు. కారు డ్రైవర్‌ను చంపి డోర్‌డెలివరి చేసింది మీ పాలనలో కాదా అని ప్రశ్నించారు. డాక్టర్ సుధాకర్ మరణానికి కారణం ఎవరని మండిపడ్డారు. రామగిరి మండలం పాపిరెడ్డిపల్లిలో లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించడానికి జగన్ రానుండటం కేవలం ఆ పార్టీ ఉనికిని చాటుకోవడానికేనని విమర్శించారు.

అభివృద్ధి పనులకు భూమిపూజ

పరిగి మండలంలో పలు అభివృద్ధి పనులకు మంత్రి సవిత భూమి పూజ చేసి ప్రారంభించారు. పైడేటి నుంచి నర్సాపురానికి తారు రోడ్డు నిర్మాణానికి రూ.కోటి కేటాయించారు. విట్టాపల్లి నుంచి తిరుమలదేవరపల్లికి, ఊటకూరు నుంచి అక్కంపల్లి సీసీ రోడ్డు నిర్మాణానికి భూమి పూజ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.2కోట్లు కేటాయించినట్లు తెలిపారు. ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ నిర్మాణానికి రూ.9లక్షలు, 44గోకులం షెడ్లు, బీసీ హాస్టళ్ల మరమ్మతులకు రూ.45లక్షలు, హాస్టల్ నిర్మాణానికి రూ.కోటి మంజూరైనట్లు తెలిపారు. రూ.కోటితో పైడేటి నూతన సబ్‌స్టేషన్‌ను నెలరోజుల్లో ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీధర్, తహసీల్దార్ హసీనాసుల్తానా, మండల కన్వీనర్ గోవిందరెడ్డి, మారుతిప్రసాద్, సర్పంచ్ బాలాజీ, కాంట్రాక్టర్ మహేశ్వర్ రావు, తిలక్, వడ్డె హనుమయ్య పాల్గొన్నారు.

బీసీల ద్రోహి జగన్

- హత్యా రాజకీయాలను ప్రోత్సహించడానికే పర్యటన
- టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప



మాట్లాడుతున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప

హిందూపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోనే బీసీల ద్రోహి మాజీ ముఖ్యమంత్రి జగన్‌రెడ్డి అని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప మండిపడ్డారు. హిందూపులంలోని ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ కార్యాలయం వద్ద శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. రాష్ట్రానికి నాలుగుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు ఫ్యాక్షనిజాన్ని అణచివేశారని అన్నారు. ఫ్యాక్షన్‌తో రక్తంపారిన గ్రామాల్లో హంద్రీనీవా నీరిచ్చి పచ్చని పొలాలుగా మార్చిన ఘనత చంద్రబాబుదే అన్నారు. జగన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డాక్టర్ సుధాకర్‌ను హింసించి చంపేశారని తెలిపారు. బీసీ నాయకుడు చంద్రయ్యను హత్యచేస్తే ఆయన కుటుంబానికి సంతాపం తెలిపావా.. ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో ఎంతోమంది మీ పార్టీ నాయకులు ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీ నాయకులు చంపితే ఏ ఒక్కరికైనా పరామర్శించిన పాపానపోలేదన్నారు. ఇద్దరి మధ్య గొడవతో రామగిరి మండలంలో ఒక వ్యక్తి చనిపోతే రాజకీయ లబ్ధి కోసం ఆయన్ను పరామర్శించడానికి ఏ మొహం పెట్టుకుని వస్తున్నావని ప్రశ్నించారు. ఐదేళ్లకాలంలో తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డి చేసిన దందాలు, సెటిల్‌మెంట్లు, బీసీలను అణగదొక్కడం కనిపించలేదా అన్నారు. మున్సిపల్ చైర్మన్ డీఈ రమేష్ మాట్లాడుతూ.. తల్లికి, చెల్లికి న్యాయం చేసిన తరువాత లింగమయ్య కుటుంబాన్ని పరామర్శించాలన్నారు. సమావేశం నాయకులు రాము, రామాంజనేయులు, అమర్‌నాథ్, రవీంద్రనాయుడు పాల్గొన్నారు.

పరిటాల, చమన్ కుటుంబాలది విడదీయరాని బంధం

- శ్రీరామ్, ఉమర్ మధ్య అదే స్నేహబంధం
- చమన్ మృతిపై ఆరోపణలను ఖండిస్తున్నా
- తోపుదుర్తిని హెచ్చరించిన చమన్‌సాబ్ సతీమణి రమీజా



మాట్లాడుతున్న రమీజా

అనంతపురం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పరిటాల, చమన్ కుటుంబాలది విడదీయరాని బంధమని జడ్పీ మాజీ చైర్మన్ దివంగత చమన్‌సాబ్ సతీమణి, రామగిరి మాజీ ఎంపీపీ రమీజా అన్నారు. పరిటాల రవీంద్ర, చమన్ ఏ విధంగా స్నేహభావంతో మెలిగారో... పరిటాల శ్రీరామ్, తన కుమారుడు ఉమర్‌ముక్తార్ అదే స్నేహబంధాన్ని కొనసాగిస్తున్నారని అన్నారు. రాప్తాడు నియోజకవర్గంలో కొన్ని రోజులుగా జరుగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో... మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చమన్‌ను పరిటాల కుటుంబం హత్య చేసిందని చేసిన వ్యాఖ్యలపై చమన్ సతీమణి రమీజా స్పందించారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ... ఆమె శనివారం మీడియాకు వీడియో విడుదల చేశారు. పరిటాల కుటుంబమే చమన్‌ను హత్య చేసిందని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ప్రస్తావించడాన్ని పూర్తిగా ఖండిస్తున్నా అన్నారు. ఈ తరహా వ్యాఖ్యలను గతం నుంచి తనతో పాటు తన కుమారుడు ఉమర్ ముక్తార్ పలు సందర్భాల్లో ఖండించామని గుర్తుచేశారు. పరిటాల, చమన్ కుటుంబాలది ఈనాటి బంధం కాదన్నారు. పరిటాల రవీంద్ర, చమన్ స్నేహితులు కన్నా... అన్నదమ్ములుగా మెలిగారని అన్నారు. అదే బాటలో శ్రీరామ్, ఉమర్‌ముక్తార్ నడుస్తున్నారన్నారు. తమ రెండు కుటుంబాల మధ్య ఇలాంటి మాటలు మాట్లాడొద్దని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని ఆమె హెచ్చరించారు. తమ కుటుంబాలను వేరుచేయడం ఎవరి వల్ల కాదన్నారు. ఇంకోసారి ఇలాంటి వ్యాఖ్యలు చేయొద్దని ఆమె తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి హితవు పలికారు.

స్వామి వారి దర్శనానికి వేచి ఉన్న భక్తులు



ఖాద్రీశుడి ఆలయం భక్తులతో కిటకిట

కదిరి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాద్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. శని, ఆది వారాలు సెలవు కావడంతో భక్తులు మరింత అధిక సంఖ్యలో స్వామిరి దర్శనానికి విచ్చేశారు. ఉదయం నుంచే క్యూలైన్లలో వేచి ఉండి స్వామిని దర్శించుకున్నారు. తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా కర్ణాటక రాష్ట్రం నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి స్వామిని దర్శించుకోవడానికి శుక్రవారం రాత్రే ఆలయానికి చేరుకున్నారు. ధ్వంజస్తంభం వద్ద మహిళలు దీపాలు వెలిగించారు.

పసుపు పుచ్చకాయ





హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పుచ్చకాయ లోపలి భాగం ఎర్ర రంగులో ఉండటం సర్వ సాధారణం. కాని హిందూపురంలో మాత్రం పసుపుపచ్చ రంగులో ఉన్న పుచ్చకాయలను వ్యాపారులు విక్రయిస్తున్నారు. పైనాపిల్ రంగులో ఉన్న పుచ్చకాయలను జనం ఆసక్తిగా చూసి కొంటున్నారు. రుచి సాధారణంగానే ఉన్నా.. రంగు వేరే ఉండటంతో కొందరు అనుమానిస్తూనే.. రుచి చూస్తున్నారు. వీటిని విక్రయించే వ్యాపారికి సైతం వాటి రంగు వేరే అనే విషయం కోసేదాకా తెలియకపోవడం గమనార్హం. వీటిని ఎక్కడి నుంచి కొని తెచ్చిందీ తనకు తెలియదని విక్రేత అన్నారు.

పాముకాటుతో రైతు మృతి

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పనులకు వెళ్లిన సమయంలో పాము కాటు వేయడంతో రొద్దం మండలం కంబాలపల్లికి చెందిన రైతు సిద్దప్ప(48) మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు కంబాలపల్లి గ్రామానికి చెందిన సిద్దప్ప తన రెండెకరాల పొలంలో మల్బరీ సాగుచేస్తుండేవాడు. శనివారం ఉదయం సిద్దప్ప కాడెద్దులను తోలుకుని వ్యవసాయ పొలానికి వెళ్లాడు. మల్బరీ పంటలో దున్నుతుండగా ఉదయం 10గంటల సమయంలో పాము కాటేసింది. అపస్మారకస్థితిలో ఉన్న అతడిని స్థానికులు గుర్తించి పెను కొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతుడికి భార్య సువర్ణమ్మ, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కానిస్టేబుల్ షెక్షావలి తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని సిద్దప్ప మృతదేహాన్ని సందర్శించి పూలమాలలువేసి నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి



భాగ్యరాజ్ (ఫైల్)

లేపాక్షి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కొడికొండ-శిర జాతీయరహదారి చోళసముద్రం టోల్‌గేట్ వద్ద శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతి చెందాడు. మరో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు పరిగి మండలం శ్రీరంగరాజులపల్లికి చెందిన భాగ్యరాజ్(26) లేపాక్షి నుంచి ద్విచక్రవాహనంపై స్వగ్రామానికి బయల్దేరాడు. లేపాక్షి మండలం గలిబిపల్లి గ్రామానికి చెందిన నాగరాజు, మరో వ్యక్తితో కలిసి ద్విచక్రవాహనంపై హిందూపురం నుంచి వస్తున్నాడు. టోల్‌గేట్‌వద్ద ఎదురెదురుగా వచ్చిన ద్విచక్రవాహనాలు బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో భాగ్యరాజ్ అక్కడికక్కడే మృతిచెందాడు. నాగరాజు, మరో వ్యక్తికి తీవ్ర గాయాలు కావడంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లేపాక్షి ఏఎస్ఐ షర్ఫుద్దీన్ ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పనిచేస్తూ కార్మికుడి మృతి

రాయదుర్గం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కోతిగుట్టలో భవన నిర్మాణ పని చేస్తూ మారెన్న(60) అనే కార్మికుడు కుప్పకూలి అక్కడికక్కడే మృతి చెందాడు. ముత్రాసికాలనీలో నివాసముండే మారెన్న శనివారం ఉదయం భవన నిర్మాణ పనికి కోతిగుట్టకు వెళ్లాడు. అక్కడ సిమెంట్, ఇసుక కలుపుతూ మధ్యాహ్నం ఒక్కసారిగా స్పృహతప్పి పడిపోయాడు. తోటి కార్మికులు వెంటనే ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. గుండెపోటు లేక వడదెబ్బతో మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతుడికి భార్య, ముగ్గురు సంతానం ఉన్నారు.

భవనం పైనుంచి పడి వృద్ధురాలి మృతి

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రమైన పుట్టపర్తిలోని చిత్రావతి రోడ్డులో గల రంగసాయి అపార్టుమెంటులో నివాసముంటున్న హేమలత (80) అనే వృద్ధురాలు శనివారం ఉదయం ప్రమాదవశాత్తు పైనుంచి కిందపడి మృతిచెందారు. వ్యాయామం చేయడానికి ఆరో అంతస్తులోకి వెళ్లి, అక్కడి నుంచి కాలుజారి కింద ఉన్నపూల కుండీలపై పడడంతో అక్కడిక్కడే మృతిచెందారు. కృష్ణ జిల్లాకు చెందిన మృతురాలు 15 సంవత్సరాలు క్రితం పుట్టపర్తికి వచ్చి సత్యసాయిబాబా సేవకురాలుగా పనిచేస్తుండేది. మృతురాలి చెల్లెలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు అర్బన్ సీఐ సునీత తెలిపారు.

చీనీ టన్ను రూ. 26వేలు

అనంతపురం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): స్థానిక వ్యవసాయ మార్కెట్‌లో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ఠంగా రూ. 26,500 పలికినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. కనిష్ఠంగా రూ. 8వేలు, సరాసరి రూ. 16,500తో అమ్ముడుపోయినట్లు తెలిపారు. మార్కెట్‌కు మొత్తం 1070 టన్నుల చీనీకాయలు వచ్చాయన్నారు.

న్యూస్ బాక్స్

వసతి గృహాన్ని తనిఖీచేసిన కలెక్టర్



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్

పుట్టపర్తిటౌన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి మున్సిపాలిటీ పరిధిలోని యనుములపల్లి సాంఘిక సంక్షేమ శాఖ వసతి గృహాన్ని కలెక్టర్ టీఎస్ చేతన్ శనివారం తనిఖీ చేశారు. వసతి గృహాన్ని పరిశీలించి, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. వంట, భోజన శాలలతోపాటు మరుగుదొడ్లు పరిశీలించి, జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. విద్యార్థులతో సౌకర్యాలపై కలెక్టర్ ఆరాతీశారు. వసతిగృహానికి కావాలసిన మరమ్మతు లు ఐదురోజుల్లో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఆ యనతో పాటు సాంఘిక సంక్షేమ శాఖాదికారి శివరంగప్రసాద్, అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి బాలాజీ, వార్డన్ విజయ్‌కుమార్ ఉన్నారు.

ఏడీజే కోర్టు ఏర్పాటు చేయండి



జస్టిస్ సురేష్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న న్యాయవాదులు

కదిరి లీగల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలంగా కదిరిలో అదనపు జిల్లా కోర్టు కోసం ఎదురు చూస్తున్నామని సహకారం చేసి సహాయపడాలని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కే సురేష్‌రెడ్డిని న్యాయవాదులు కోరారు. అనంత పర్యటనకు వచ్చిన జస్టిస్ సురేష్‌రెడ్డిని కదిరి న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చౌడప్ప, ప్రధాన కార్యదర్శి సురేంద్ర ఆధ్వర్యంలో సంఘ సభ్యులు శనివారం కలిశారు. కదిరిలో ఏడీజే కోర్టు అవసరాన్ని ప్రజలకు కలిగే సౌకర్యాలను వివరించి చెప్పారు. న్యాయమూర్తి సానుకూలంగా స్పందించినట్లు చౌడప్ప తెలిపారు.

సీతారాముల కల్యాణానికి తరలిరండి



టీడీపీ నాయకులను ఆహ్వానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

ధర్మవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): సీతారాముల కల్యాణానికి భక్తులు తరలిరావాలని కోదండ రామస్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు శనివారం టీడీపీ నాయకులను ఆహ్వానించారు. స్థానిక గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు పామిశెట్టి క్రిష్టయ్య, ఉపాధ్యక్షుడు చందా రామాంజనేయులు, పూజారి ఆదినారాయణ ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్‌లకు ఆహ్వాన పత్రికలు అందజేశారు. ఆదివారం ఉదయం కల్యాణోత్సం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమాలు ఉంటాయని వారు తెలిపారు.

నేడు సీతారాముల కల్యాణం

బుక్కపట్నం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి సందర్భంగా మండలకేంద్రంలోని వాల్మీకి రామాలయంలో ఆదివారం సీతారాముల కల్యాణాన్ని నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం 6 గంటలకు సీతారామ, లక్ష్మణ సమేత ఆంజనేయస్వామికి పంచామృతాభిషేకం, విశేష పూజలు ఉంటాయన్నారు. 11 గంటలకు సీతారాముల కల్యాణం జరుగుతుందన్నారు. భక్తులు అందరూ పాల్గొన్నాలని వారు కోరారు.

మార్కెట్ యార్డుకు ఇద్దరు డైరెక్టర్ల ఎంపిక



మండల కన్వీనర్‌ను శాలువాతో సత్కరిస్తున్న నాయకులు

తాడిమర్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ధర్మవరం వ్యవసాయ మార్కెట్ యార్డు కమిటీకి తాడిమర్రి మండలం నుంచి ఇద్దరు ఎంపికయ్యారు. రామాపురం గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ తమ్మినేని నాగలక్ష్మి, శివంపల్లి గ్రామానికి చెందిన అచ్చెమ్మ డైరెక్టర్లుగా ఎంపికయ్యారు. వారు టీడీపీ మండల కన్వీనర్ కూచి రామ్మోహన్‌ను కలిసి సత్కరించారు. నాయకులు హర్ష, రామ్మోహన్, శ్రీనివాసరెడ్డి, పక్కీర్‌రెడ్డి, భాస్కర్‌గౌడ్ పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ సోమశేఖర్

బత్తలపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని నాలుగు రోడ్ల కుడలిలో శనివారం ఎస్ఐ సోమశేఖర్ చలివెంద్రాన్ని ప్రారంభించారు. వేసవిలో ఎండలు తీవ్రంగా పెరగడంతో పోలీసుల ఆధ్వర్యంలో గంగమ్మగుడి వద్ద చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ దానాల్లో నీటి దానం చేయడం చాలా గొప్పదన్నారు. అన్నం పెట్టకపోయినా కనీసం తాగేందుకు గ్లాసు నీరు అయినా ఇవ్వాలన్నారు.

ఎంపీపీపై చర్యలు తీసుకోవాలి

ఓబుళదేవరచెరువు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా రేయింబవళ్లు విధులు నిర్వహిస్తే అలాంటి పోలీస్ అధికారులపై తప్పుడు ఫిర్యాదులు, ఆరోపణాలు చేయడం సరికాదని గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్ అన్నారు. శనివారం ఆయన ఓబుళదేవరచెరువులో విలేకరులతో మాట్లుడారు. నల్లమాడ సీఐ నరేంద్రరెడ్డి, ఓడీసీ ఎస్ఐ మల్లికార్జునరెడ్డి ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణయాదవ్‌ఆధ్వర్యంలో ఇటీవల కలెక్టరేట్ వద్ద నిరసన తెలపడానికి వచ్చిన వారిని విధి నిర్వాహణలో భాగంగా కలెక్టరేట్‌లోకి వెళ్లకుండా అడ్డుకోవడంపై ఆరోపణలు చేయడం సరికాదన్నారు. తప్పుడు ఆరోపణలు చేస్తున్న ఎంపీపీపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

కారు బోల్తా.. తప్పిన ప్రమాదం

నంబులపూలకుంట, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రానికి సమీపంలోని పాత సొసైటీ కార్యాలయం సమీపంలో శనివారం కారు బోల్తాపడింది. కారులో ప్రయాణీస్తున్న ఇద్దరుయువకులకు ప్రమాదం తప్పినట్లు బాధితులు తెలిపారు. మండలంలోని పెడబల్లినుంచి ఎన్పీకుంట కేంద్రానికి కారులు వస్తుండగా, అదుపు తప్పి కారు బోల్తాపడిందన్నారు. ఈప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదన్నారు.

అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు..!

- అర్ధంతరంగా ఆగిన భవన నిర్మాణాలు
- మూడేళ్లుగా ముందుకు సాగని పనులు
- పట్టించుకోని అధికారులు

ధర్మవరం రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు సొంత భవనాలు లేక అద్దెభవనాల్లోనే నేటికీ కొనసాగుతున్నాయి. గత ప్రభుత్వంలో అంగన్‌వాడీలు మంజూరైన వాటి నిర్మాణంలో జాప్యం చేయడంతో ప్రస్తుతం అవి పిల్లర్లకు, మొండిగోడలుగా గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి. ఈ భవన నిర్మాణాలు పంచాయతీ రాజ్ ఇంజనీర్ల పర్యవేక్షణలో ఉపాధి నిధులతో గత ప్రభుత్వంలో భూమి పూజ చేశారు. సకాలంలో బిల్లులు చెల్లించక కేంద్రాల నిర్మాణ పనులు ముందుకు సాగక ఎక్కడ పనులు అక్కడే నిలిచిపోయాయి. సొంత భవనాలు లేక చిన్నారులు, గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అద్దెభవనాల్లో అరకొర సదుపాయాలతో, అపరిశుభ్రత నడుమ నడుస్తున్నాయని పలువురు గ్రామస్థులు అంటున్నారు. ఈ ప్రభుత్వంలోనైనా అంగన్‌వాడీ భవనాలు పూర్తిచేయాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ఎన్నికేంద్రాలు ఉన్నాయంటే..: ధర్మవరం పట్టణ, రూరల్ పరిధిలో 230 అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నట్లు ఆశాఖ అధికారులు తెలిపారు. రూరల్‌పరిధిలో 95 కేంద్రాలు, అర్బన్ పరిధిలో 135 ఉన్నాయని తెలిపారు. రూరల్‌లో 29 కేంద్రాలకు మాత్రమే శాశ్వత భవనాలు ఉన్నాయన్నారు. మిగిలినవి అద్దె భవనాల్లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఒక్కో అద్దె భవనానికి గ్రామీణ ప్రాంతంలో రూ.2వేలు, పట్టణ ప్రాంతంలో రూ.6వేలు చెల్లిస్తున్నట్లు తెలిపారు.



నేలకోటతండాలో పిల్లర్లకే పరిమితమైన అంగన్‌వాడీ కేంద్రం



నిమ్మలకుంట అసంపూర్తిగా అంగన్‌వాడీ కేంద్రం

అద్దెభవనాల్లో అగచాట్లు: అంగన్‌వాడీ కేంద్రాలను అద్దెభవనాల్లో నిర్వహిస్తుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆయా అంగన్‌వాడీ కేంద్రాల టీచర్లు, ఆయాలు గగ్గోలు పెడుతున్నారు. సరైన సదుపాయాలులేక, ఇరుకు గదుల్లో, వంటగది లేక, అందులోనే చిన్నపిల్లలు ఉక్కపోతతో అల్లాడిపోతున్నారన్నారు. చాలా భవనాల వద్ద కనీసం మరుగుదొడ్లు లేక ఇబ్బందులు పడుతున్నారని, పిల్లలు మలమూత్రవిసర్జన చేస్తే టీచర్లు, ఆయాలు వెంటనే వారి తల్లులకు చెప్పి ఇంటికి పంపిస్తున్నట్లు ఆయా గ్రామాల మహిళలు చెబుతున్నారు.

ఈ ప్రభుత్వంలోనైనా ముందుకు సాగేనా..?

గ్రామాల్లో గత ప్రభుత్వ హయాంలో నిర్మాణాలు ప్రారంభించిన అంగన్‌వాడీ కేంద్రాలు గోడలకు, పిల్లర్లకు పరిమితం కావడంతో ఈ ప్రభుత్వంలోనైనా వాటిని పూర్తిచేసి అందుబాటులోకి తేవాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు. లక్షలు వెచ్చించిన నిర్మిస్తున్న భవనాలు అర్ధంతరంగా ఆగిపోవడంతో నిధులు దుర్వినియోగం అయ్యాయని, వాటిని పూర్తిచేసి పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

ఉన్నతాధికారులకు నివేదించాం



గ్రామాల్లో అర్ధంతరంగా ఆగిపోయిన అంగన్‌వాడీ కేంద్రాలపై ఇప్పటికే ఉన్నతాధికారులకు నివేదించాం. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే వాటి నిర్మాణాలు పూర్తిచేసేందుకు చర్యలు చేపడతాం. భవనాలు లేని చోట పిల్లలకు ఇబ్బందులు లేకుండా అద్దెభవనాల్లోనే కేంద్రాలను నిర్వహిస్తున్నాం.

- కె.వై లక్ష్మి, సీడీపీఓ, ధర్మవరం

పరిటాల సునీతను కలిసిన మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్



ఎమ్మెల్యే పరిటాలసునీత, పరిటాలశ్రీరామ్‌ను కలిసిన ధర్మవరం మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్ అంబటి అరుణశ్రీ

ధర్మవరం, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ధర్మవరం మార్కెట్‌యార్డ్ చైర్‌పర్సన్‌గా ఎంపికైన అంబటి అరుణశ్రీ శనివారం అనంతపురం క్యాంప్ కార్యాలయంలో ఎమ్మెల్యే పరిటాలసునీత, ధర్మవరం టీడీపీ ఇన్‌చార్జ్ పరిటాలశ్రీరామ్‌లను కలిశారు. చైర్‌పర్సన్, ఆమె భర్త, బీజేపీ జాతీయ నాయకులు అంబటి సతీశ్‌కుమార్‌లతో పాటు మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ ముళ్లగూరు అయ్యప్ప వారిని శాలువాలతో సత్కరించారు. ధర్మవరం పట్టణంలో జనసేన పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి చిలకం మధుసూదన్‌రెడ్డిని ఆయన స్వగృహంలో వారు కలిశారు. పరిటాలసునీత మాట్లాడుతూ రైతులకు నిరంతరం అందుబాటులో ఉంటూ వారికి అన్నివిధాలుగా సేవలందించాలన్నారు. టీడీపీ నాయకులు చింతలపల్లి మహేశ్, ఫణికుమార్, విజయసారధి, బీజేపీ నాయకుడు గుండా పుల్లయ్య పాల్గొన్నారు.

నేడు రామాలయాలను సందర్శించనున్న మంత్రి

ధర్మవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమిని పురస్కరించుకుని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఆదివారం పట్టణంలోని పలు రామాలయాలను సందర్శించనున్నట్లు బీజేపీ నాయకులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రాంనగర్, గీతానగర్, దిమ్మిల్‌సెంటర్, గొట్లూరులోని రామాలయాలను సందర్శిస్తారన్నారు. 4గంటలకు ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో హాకీ పోటీలను ప్రారంభిస్తారన్నారు. సోమవారం బత్తలపల్లి ప్రభుత్వ బాలికల ఉన్నతపాఠశాలలో ఉదయం 10గంటలకు వైద్యశిబిరాన్ని మంత్రి ప్రారంభిస్తారన్నారు. 8న మంగళవారం మధ్యాహ్నం 12గంటలకు ఎన్డీఏ కార్యాలయంలో బ్యాంకర్లతో సమావేశం, 3.30 నుంచి 5.00 గంటలకు అసెంబ్లీ క్రియాశీలక సభ్యుల సమావేశంలో పాల్గొంటున్నట్లు తెలిపారు.

పేదవాడి ఫ్రిజ్‌కు భలే గిరాకీ..!



వాహనంలో కుండలను తరలిస్తున్న దృశ్యం

తాడిమర్రి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఎండలు తీవ్రం కావడంతో పేదవాడి ఫ్రిజ్‌గా పిలవబడే కుండలకు డిమాండ్ పెరిగింది. మండలంలో కుండలు చేసేవారు లేక ఇతర ప్రాంతాల నుంచి తెప్పించుకుని అమ్ముతున్నారు. శనివారం మధ్యాహ్నం వేళ తాడిమర్రి మీదుగా ఓ వాహనంలో దాదాపు 200 కుండలను తీసుకెళ్లారు. ఫ్రిజ్ కంటే మట్టితో తయారు చేసిన కుండలో నీటిని తాగడమే శ్రేయస్కరమని డాక్టర్లు చెబుతుండటంతో ప్రజలు వాటి కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

ఆఖరి మజిలీకి మెకానిక్ ఆసరా

- పేదల కోసం వైకుంఠ రథం ఏర్పాటు
- పలువురి మన్ననలు పొందుతున్న కిషోర్

ముదిగుబ్బ, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): ఆయన ఒక సాధారణ ట్రాక్టర్ మెకానిక్. కానీ దాతృత్వంలో దొడ్డమనస్సు. రెండు సంవత్సరాలుగా మండల కేంద్రంలో వైకుంఠ రథం సేవలు ఉచితంగా అందిస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన ట్రాక్టర్ మెకానిక్ కిషోర్ పేద, మధ్య తరగతి కుటుంబాలలో ఎవరైనా మరణిస్తే మృతదేహాలను ఇంటి వద్ద నుంచి శ్మశాన వాటికకు తరలించేందుకు వైకుంఠ రథం కావాలని ఫోన్ చేసి తెలిపితే వెంటనే వాహనాన్ని ఏర్పాటు చేస్తారు. వాహనానికి అవసరమైన డీజిల్ ఖర్చును, వాహన డ్రైవర్‌కు రుసుము చెల్లించాల్సి ఉంటుంది. వాహనానికి ఎలాంటి రుసుము తీసుకోకుండా వైకుంఠ రథం సేవలు ఉచితంగా అందిస్తుండడంతో, ఖననం సమయంలో ఆర్థిక సమస్యలతో ఇబ్బంది పడుతున్న ఎందరో మెకానిక్ దాతృత్వాన్ని అభినందిస్తున్నారు.



వైకుంఠ రథం

ఇబ్బంది పడకూడదనే...

- మెకానిక్ కిషోర్, ముదిగుబ్బ



మనిషి మరణిస్తే శ్మశాన వాటికకు తీసుకెళ్లేందుకు వైకుంఠ రథానికి వేలాది రూపాయలు పేద, మధ్య తరగతి వారు ఖర్చు చేయలేరు. కరోన సమయంలో మృతదేహాలను శ్మశాన వాటికలకు తీసుకెళ్లేందుకు వేల రూపాయలు తీసుకోవడం కళ్లారా చూశాను. ఆఖరి మజిలీకి పడుతున్న ఇబ్బందులు చూసి మనసు చలించింది. తనవంతుగా సేవాభావంతో ఉచిత వైకుంఠ రథం ఏర్పాటు చేయాలని రెండేళ్ల కిందట అమలులోకి తీసుకొచ్చాను. ఇప్పటి వరకు 191 మంది మృతదేహాలను ఖననానికి తరలించాం. ఎవరు ఫోన్ చేసినా వైకుంఠ రథాన్ని పంపుతున్నాను. సెల్ నెంబర్:9985976579, 789305997కు సంప్రదిస్తే వైకుంఠ రథాన్ని వెంటనే పంపుతాం.

తోపుదుర్తీ.. జాగ్రత్త..!

- కుటుంబాల మధ్య చిచ్చుపెట్టొద్దు
- మాజీ ఎమ్మెల్యేపై టీడీపీ నాయకుల ఫైర్

ధర్మవరం, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): తోపుదుర్తీ.... జాగ్రత్త.. కులాలు, మతాలు మధ్య చిచ్చుపెట్టి రాజకీయ లబ్ధిపొందడానికి ప్రయత్నిస్తే బీసీలంతా ఏకమై మిమ్మల్ని రాజకీయ సమాధి కట్టడానికి సిద్ధంగా ఉన్నామని టీడీపీ నాయకులు ఫైర్ అయ్యారు. శనివారం స్థానిక గాంధీనగర్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో నాయకులు తలారి చంద్రమోహన్‌బాబు, అంబటి సనత్‌కుమార్, రాళ్లపల్లి షరీఫ్, పఠాన్‌బూబూఖాన్, డిష్ లచ్చి, షామీర్, ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు వరదరాజులు మాట్లాడారు. తోపుదుర్తి, ఆయన కుటుంబంపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాశ్‌రెడ్డికి వయస్సు పెరిగినా బుద్ధిపెరగడంలేదన్నారు. ఇప్పటికీ వారి అధినాయకుడు లెవన్‌రెడ్డి(జగన్‌రెడ్డి) కుట్రలు, కుతంత్రాలు మోసాలకు అలవరచుకుని జిల్లాలో అదే రాజకీయాలు కులాల మధ్య వైషమ్యాలు తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారన్నారు. బీసీల్లారా వైసీపీ కులాల ఉచ్చులో పడకుండా మేలుకొనాల్సిన అవసరం ఎంతైనాఉందన్నారు. మీరెన్ని కుట్రలు, కుతంత్రాలు పన్నినా పరిటాల సునీత, పరిటాలశ్రీరామ్ వెంటే ఉమ్మడి జిల్లా బీసీలందరూ ఉంటారని వారు పేర్కొన్నారు.

బత్తలపల్లి: పరిటాల కుటుంబాన్ని విమర్శించేస్థాయి తోపుదుర్తి కుటుంబానికి లేదని టీడీపీ నాయకులు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. పరిటాల కుటుంబానికి రాష్ట్రంలోనే దానధర్మాలు చేసే కుటుంబమని పేరుందన్నారు. మీకుటుంబానికి అక్రమ వసూళ్లు, కబ్జాలు చేస్తారనే పేరు ఉందని విమర్శించారు. పరిటాల కుటుంబాన్ని విమర్శిస్తే నియోజకవర్గ ప్రజలు నీకు రాజకీయ భవిషత్ లేకుండా చేస్తారన్నారని మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై మండి పడ్డారు. కార్యక్రమంలో నారాయణస్వామి, నాగభూషణ చౌదరి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



ధర్మవరంలో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

ధర్మవరంరూరల్: పరిటాల కుటుంబాన్ని విమర్శించే అర్హత తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి లేదని టీడీపీ రాష్ట్ర సాంస్కృతిక విభాగం అధికారప్రతినిధి నిమ్మలకుంట దళవాయి కుళ్లాయప్ప అన్నారు. శనివారం మండలంలోని నిమ్మలకుంట గ్రామంలో ఆయన నివాసంలో మాట్లాడారు. పాపిరెడ్డిపల్లిలో వ్యక్తిగతంగా జరిగిన హత్యకు ప్రకాష్‌రెడ్డి రాజకీయ రంగు పులిమి, బీసీల ఓట్లు కోసం రాజకీయం చేయడం అవివేకమన్నారు. కురుబ లింగమయ్యను రెచ్చిగొట్టింది నువ్వు కాదా అని ప్రశ్నించారు. రాప్తాడు అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే పరిటాలసునీత పనిచేస్తుంటే ఆ అభివృద్ధిని అడ్డుకునేందుకు ప్రకాష్‌రెడ్డి స్వార్థరాజకీయాలు చేస్తున్నారని, ఇది ప్రజలంతా గమనిస్తున్నారన్నారు.

ముదిగుబ్బ: పరిటాల కుటుంబాన్ని విమర్శించే స్థాయి రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డికి లేదని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. శనివారం రాత్రి స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో వారు మాట్లాడారు. బడుగు, బలహీన వర్గాలు, బీసీ, మైనార్టీలకు అండగా నిలిచింది పరిటాల కుటుంబమని, పరిటాల కుటుంబంపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదన్నారు. క్లస్టర్ ఇన్‌చార్జ్ తుమ్మల మనోహర్, మహబూబ్‌పీరా, మల్లెల నారాయణస్వామి, స్టుడియో అశోక్, ఆనంద్, నరసింహ, రఫి, చంద్ర, సూర్యనారాయణ పాల్గొన్నారు.



జగ్జీవన్‌రామ్ చిత్రపటం వద్ద నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

జగ్జీవన్‌రామ్ ఆశయాలు కొనసాగిద్దాం

- ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

కదిరి, ఏప్రిల్5 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు, దళిత బాంధవుడు, ఆదర్శ పార్లమెంటేరియన్ బాబు జగ్జీవన్‌రామ్ ఆశయాలను కొనసాగిద్దామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ అన్నారు. శనివారం ఆర్ అండ్‌బీ బంగ్లాలో జగ్జీవన్‌రామ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఆయన మాట్లాడుతూ స్వాతంత్ర్యం వచ్చి 75 సంవత్సరాలు దాటినా ఆదర్శవంతుడా జగ్జీవన్‌రామ్‌ను స్మరించుకుంటున్నామంటే ఆయన జీవితం ఎంత ఆదర్శమైందో అర్థమవుతోందన్నారు. కౌన్సిలర్ అల్లాముస్తఫా, నాయకులు రాజశేఖర్‌బాబు, శేషు, జయరామ్, విశ్వనాథ్, అంజనేయులు, చైతన్య, చంద్రశేఖర్, రాము, నాగేంద్రనాథ్, ప్రేమలత పాల్గొన్నారు.

జిల్లాలో బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆయన పాటించిన ఆదర్శాలు, ఆయన చూపిన సంస్కరణ మార్గాలు, ఆయన జాతికి అందించిన సేవలను పలువురు వక్తలు కొనియాడారు. పలు పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజా సంఘాల నాయకుల ఆధ్వర్యంలో ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళి అర్పించారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్



ధర్మవరంలో యుటీఎఫ్ నాయకుల నివాళి



పుట్టపర్తిలో నివాళి అర్పిస్తున్న ఆల్‌మైనార్టీ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు



ధర్మవరంలో మజ్జిగ పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకుడు వెంకటేష్



కదిరిలో ఎమ్మార్పీఎస్ నాయకులు..



ముదిగుబ్బలో తహసీల్దార్ నారాయణస్వామి..



తనకల్లులో టీడీపీ నాయకులు



ఓబుళదేవరచెరువులో బీజేపీ నాయకులు



కొత్తచెరువులో డీఈఓ కిష్టప్ప, ఉద్యోగులు



నల్లమాడలో టీడీపీ నాయకులు

న్యూస్ బాక్స్

రక్తహీనత ప్రమాదకరం

డాక్టర్ తేజశ్విని

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ



చిలమత్తూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పోషకాహార లోపం వల్ల వచ్చే రక్తహీనత ప్రమాదంగా మారే అవకాశం ఉందని మండల వైద్యాధికారిణి తేజశ్విని పేర్కొన్నారు. ప్రధానంగా మహిళల్లో వచ్చే రక్తహీనతపై ఆమె ఆంధ్రజ్యోతితో మాట్లాడారు.

ప్రశ్న: రక్తహీనత అంటే ఏమిటి.?

జవాబు: రక్తహీనత అనేది రక్త రుగ్మత. శరీరంలో తగినన్ని ఎర్రరక్త కణాలు లేనప్పుడు సంభవిస్తుంది. కొందరికి ఇది వారసత్వంగా వస్తుంది.

ప్రశ్న: ఎంత రక్త శాతం ఉంటే ఆరోగ్యంగా ఉంటారు ?

జవాబు: పురుషుల్లో 13.5 గ్రాముల నుంచి 17.5 గ్రాములు, స్త్రీలలో 12 గ్రాముల నుంచి 15.5 గ్రాముల వరకు ఉండాలి. సాధారణంగా మహిళల్లో ప్రతి వంద మిల్లీలీటర్ల రక్తంలో 12 గ్రాములు, గర్భిణి స్త్రీలలో 11 గ్రాములు, బాలింతలలో 12 గ్రాములు ఉండాలి. అంతకన్నా రక్తం తక్కువగా ఉంటే వారు రక్తహీనతతో బాధపడుతున్నట్లు అర్థం.

ప్రశ్న: రక్తహీనత లక్షణాలు ఎలా ఉంటాయి.?

జవాబు: రక్త హీనతతో బాధపడేవారు తరుచూ తలనొప్పికి గురవడం. కళ్లు తిరగడం, నిద్ర పట్టకపోవడం, జ్ఞాపకశక్తి తగ్గిపోవడం, ఊపిరి తీసుకోవడం కష్టంగా మారడంవంటివి రుగ్మతలుగా ఉంటాయి. చిన్న చిన్న పనులకే అలసిపోవడం వంటి లక్షణాలు ఉంటాయి. అదే గర్భవతుల్లో అయితే తీవ్ర నీరసం, చర్మం పాలిపోయినట్లు ఉండటం, దడ, శ్వాస ఆడకపోవడం, బలహీనతగా ఉంటుంది.

ప్రశ్న: రక్తం వృద్ధి చెందాలంటే తీసుకోవాల్సిన జాగ్రత్తలు ఏమి?

జవాబు: రక్తహీనత రాకుండా ఉండాలంటే పోషకాహారం తీసుకోవాలి. ఆహారంలో విటమిన్లు, మినరల్స్ ఉంటే విధంగా చూసుకోవాలి. పాలు, గుడ్లు, ఆకుకూరలు, కూరగాయాలు, చేపలు, మాసం వంటివి విరివిగా తీసుకోవాలి. ఎక్కువగా ఐరన్ కలిగిన ఆహారాన్ని తీసుకోవాలి. గర్భవతులు అంగన్‌వాడీ కేంద్రాల్లో అందజేసే పౌష్టికాహారం సక్రమంగా తీసుకుంటే చాలా వరకు రక్తం వృద్ధి చెందుతుంది.

ప్రశ్న: రక్తహీనతతో ఎటువంటి సమస్యలు ఎదురవుతాయి?

జవాబు: గర్భవతుల్లో రక్తహీనత ఉంటే గర్భంలో ఉన్న శిశువు ఎదుగుదల ఉండదు. ప్రసవ సమయంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతాయి. సుఖప్రసవం జరగకపోవచ్చు. ఒక వేళ సిజేరియన్ జరిగినా ప్రసవాంతరం బాలింత సమయంలో తల్లిబిడ్డకు తీవ్ర ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. సాధారణ వ్యక్తుల్లో గుండెకు సంబంధించిన వ్యాధులు, డిప్రెషన్‌కి గురవడం, పిల్లల్లో ఎదుగుదల లేకపోవడం, అంటువ్యాధుల నుంచి ప్రమాదం ఉంటుంది.

ప్రశ్న: మండలంలో రక్తహీనతతో బాధనడుతున్న వారు ఉన్నారా?

జవాబు: ఆసుపత్రికి వస్తున్న వారిలో కొందరు మహిళలు 8 గ్రాములు కలిగి ఉన్నారు. అలాంటి వారికి వెంటనే రక్త వృద్ధికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేస్తున్నాం. వారికి ఐరన్ బిళ్లలను సిఫార్సు చేస్తున్నాం. 7 గ్రాముల కంటే తక్కువ రక్తశాతం కలిగిన ఒక మహిళను గుర్తించాం. ప్రత్యేక చికిత్స అందిస్తున్నాం.

రైతులకు రాయితీల పంట

50 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలు

చిలమత్తూరు, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం 50 శాతం రాయితీతో వ్యవసాయ పరికరాలను అందిస్తోందని మండల వ్యవసాయాధికారి వంశీకృష్ణ తెలిపారు. శనివారం ఆయన ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. బ్యాటరీతో పనిచేసే 9 స్ప్రేయర్లు, పెట్రోల్‌తో పనిచేసే 18 పవర్ స్ప్రేయర్లు మంజూరయ్యాయన్నారు. వాటిలో ఇప్పటికే 22 స్ప్రేయర్లను కొనుగోలుచేసేందుకు రైతులు ముందుకు వచ్చారన్నారు. ఆసక్తి ఉన్న రైతులు స్ప్రేయర్లు కావాలంటే ఆయా వ్యవసాయ సేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ట్రాక్టర్ల వ్యవసాయ పరికరాలు సైతం మంజూరయ్యాయన్నారు. పీవీసీ పైపులు రాయితీతో మండలానికి మంజూరయ్యాయని, వాటి కోసం 12 మంది రైతులు దరఖాస్తు చేసుకున్నారన్నారు.

ధరల పెంపుతో సామాన్యుడిపై పెనుభారం

- ర్యాలీలో బీజేపీ నాయకులు



వినతి పత్రం అందిస్తున్న బీజేపీ నాయకులు

పావగడ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వం నిత్యావసర సరుకుల ధరలనే కాకుండా పెట్రోల్, ఈ స్టాంపు ధరలను పెంచి సామాన్యుడిపై పెనుభారం మోపతోందని బీజేపీ నాయకులు ఆరోపించారు. శనివారం బీజేపీ ఆధ్వర్యంలో ధరల పెంపుపై ర్యాలీ నిర్వహించారు. శని మహాత్మా సర్కిల్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి బీజేపీ నాయకులు చేరుకున్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేసి తహసీల్దార్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందువుల వ్యతిరేకిగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. రోజురోజుకూ ధరలను పెంచుతూ సామాన్యులపై పెనుభారాన్ని మోపుతోందన్నారు. నిత్యావసర ధరలను తగ్గించి సామాన్యుడిపై భారాన్ని తగ్గించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో పెద్దఎత్తున పోరాటాలు చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. ర్యాలీలో బీజేపీ నాయకులు రవి, శివ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

హక్కులను కాలరాసేందుకే వక్ఫ్ సవరణ బిల్లు

పెనుకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ముస్లిం మైనార్టీల హక్కు, మత స్వేచ్ఛను హరించడమే వక్ఫ్ సవరణ బిల్లు లక్ష్యమని ఆవాజ్‌కమిటీ అధ్యక్షుడు మహ్మద్ బాష తెలిపారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ కేంద్ర ఉభయ సభల్లో ప్రతిపక్షాల మధ్య వక్ఫ్ చట్టానికి సవరణ బిల్లు ఆమోదం తెలిపిందన్నారు. ఈ బిల్లు ఆమోదంతో ముస్లిం మైనార్టీల హక్కు, మతస్వేచ్ఛను హరిస్తుందన్నారు. సమావేశంలో కమిటీ సభ్యులు బాబావలి, ఆరీఫ్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు అవగాహన

సోమందేపల్లి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చాలకూరు గ్రామంలో ఉపాధి కూలీలకు పెరిగిన వేతనాలపై ఎండల తీవ్రతపై శనివారం ఏపీఓ సోమశేఖర్‌రెడ్డి అవగాహన కల్పించారు. పని ప్రదేశానికి వెళ్లి కూలీలకు సంబంధించి మస్టర్లు తనిఖీ చేశారు. కూలీల హాజరు, గైర్హాజరుపై ఫీల్డ్ అసిస్టెంట్‌ను అడిగి తెలుసుకున్నారు.

శ్రీరామనవమి వేడుకలకు సిద్ధం

ముస్తాబైన ఆలయాలు... ఉట్లపరుషకు ఏర్పాట్లు పూర్తి



పెనుకొండలోని బోయపేట రామాలయం



పెనుకొండలోని మిట్ట ఆంజనేయస్వామి దేవాలయం

పెనుకొండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని పట్టణంలోని అతిపురాతనమైన రామభద్రాలయం, ఆంజనేయస్వామి ఆలయాలు సర్వాంగ సుందరంగా ముస్తాబయ్యాయి. ఆదివారం పండగను పురస్కరించుకుని రామభద్రాలయం, దక్షిణముఖ ఆంజనేయస్వామి ఊరువాకిలి ఆంజనేయస్వామి, దర్గా ఆంజనేయస్వామి, వజ్రముష్టి ఆంజనేయస్వామి, మిట్ట ఆంజనేయస్వామి, బోయపేట రామాలయాల్లో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకాలు, కల్యాణ మహోత్సవాలు నిర్వహిస్తున్నామని వడపప్పు, పాణకం, ప్రసాదంగా అందిస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. భక్తులు పాల్గొని స్వామికృపకు పాత్రులు కావాలన్నారు.

పులమతిలో రథోత్సవం

లేపాక్షి, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి పండగకు ఆలయాలు ముస్తాబయ్యాయి. మండల పరిధిలోని అన్ని శ్రీరామ ఆలయాల్లో భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నారు. పులమతి గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో శనివారం నుంచి ప్రత్యేకపూజలు, అభిషేకాలనున నిర్వహిస్తున్నారు. ఆదివారం సీతారాముల రథోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధంచేశారు.



పులమతి ఆలయంలో వెలసిన ఆంజనేయస్వామి

నేడు ఉట్లపరుష

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెద్దచెరువు కట్ట ఆంజనేయ స్వామి దేవాలయం వద్ద ఆదివారం ఉట్లపరుష నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ప్రభాకర్‌స్వామి తెలిపారు. శ్రీరామనవమి పండగను పురస్కరించుకుని ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. ఆదివారం సాయంత్రం ఉట్లపరుష ఉంటుందని, పెద్దఎత్తున భక్తులు తరలిరావాలని ఆయన కోరారు.

సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో లంకాదహనం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పట్టణ పరిధిలోలోని సూగూరు ఆంజనేయస్వామి ఆలయంలో శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆలయంలో ప్రత్యేక పూజలు. అర్చనలు అభిషేకాలు నిర్వహించనున్నారు. ఆదివారం ఉదయం 10 గంటలకు సీతారాముల కల్యాణోత్సవం, మధ్యాహ్నం 12 గంటలకు రథోత్సవం, సాయంత్రం 4.30 గంటలకు ఉట్ల పరుష, సాయంత్రం 6 గంటలకు లంకాదహనం ఉంటుంది. అనంతరం ఆర్కే రెజ్లింగ్ ఆధ్వర్యంలో కుస్తీపోటీలను బాలబాలికలకు నిర్వహించనున్నారు. శ్రీరామనవమి సందర్భంగా ఆలయంతోపాటు పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో వెలిగిపోతున్నాయి. అదేవిధంగా పట్టణంలో అతి పెద్ద ఏకశిలా ఆంజనేయస్వామి దేవాలయం దండురోడ్డులో, మోడల్ కాలనీలోని ప్రసన్న ఆంజనేయస్వామి దేవాలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజలతోపాటు ఉట్లపరుష తదితర కార్యక్రమాలను నిర్వహించనున్నారు.



విద్యుత్ దీపాల వెలుగులో సూగూరు ఆంజనేయస్వామి ఆలయం

కోనాపురంలో తాగునీటికి కటకట

ఆరునెలలుగా మోటారు మరమ్మతులు చేయని అధికారులు

వ్యవసాయ బోరుబావులను ఆశ్రయిస్తున్న మహిళలు



వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకుంటున్న మహిళలు





ఎస్సీ కాలనీలో మరమ్మతులకు గురైన బోరు, స్టార్టర్

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): వేసవిలో తాగునీటిని అందించాల్సిన అధికారుల నిర్లక్ష్యంతో పెనుకొండ మండలం కోనాపురం పంచాయతీలో తీవ్ర తాగునీటి ఎద్దడినెలకొంది. ఆరు నెలలుగా గ్రామంలో బోరుబావులు మరమ్మతులకు గురైనా పెనుకొండ నగర పంచాయతీ అధికారులు అటువైపు కన్నెత్తిచూడటంలేదని, తాగునీరు అందక సమీప బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన దుస్థితి పట్టిందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కోనాపురంలో 300 కుటుంబాలున్నాయి. 1800మంది జనాభా ఉంది. గ్రామానికి మూడు బోరుబావులు ఉన్నాయి. ఆరు నెలల క్రితం ఎస్సీకాలనీలో ఉన్న రెండు బోరుబావుల్లో ఒకటి మరమ్మతులకు గురైంది. వచ్చే అరకొర నీటి కోసం రోజూ పనులు వదులుకుని గంటల తరబడి వేచి చూడాల్సి వస్తోందని కాలనీవాసులు అంటున్నారు. పండగ వచ్చిందంటే నీటి కోసం ఇంటిల్లిపాది వ్యవసాయ బోరుబావుల వద్దకు వెళ్లి నీటిని తెచ్చుకోవాల్సిన పరిస్థితి వస్తోందంటున్నారు. వేసవిలో తాగునీటిని అందించాల్సిన అధికారులు ఆరు నెలలుగా మరమ్మతు చేయించకపోవడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఇటువైపు కన్నెత్తికూడా చూడలేదని అంటున్నారు. ఇప్పటికైనా ఎస్సీకాలనీలో పాడైన బోరుబావులకు మరమ్మతులు చేయించి నీరు వచ్చేవిధంగా చూడాలని గ్రామస్థులు కోరుతున్నారు. ఈ విషయంపై నగర పంచాయతీ కమిషనర్ సతీష్‌కుమార్‌ను వివరణ కోరగా కోనాపురంలో తాగునీటి సమస్య ఉందని ఫిర్యాదు వస్తే గ్రామాన్ని పర్యటించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. గ్రామంలో తాగునీటి బోరుబావులకు రూ.8లక్షలు మంజూరైందని 16, 17తేదీల్లో నూతన బోరు తవ్వించి సమస్యను పరిష్కరిస్తామన్నారు.

క్రమశిక్షణతో చదివితే బంగారు భవిష్యత్తు

- డీఎస్పీ వెంకటేశ్వర్లు



వేడుకలలో బాలికల నృత్య ప్రదర్శన

పెనుకొండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశనుంచే క్రమశిక్షణ, అంకితభావంతో చదివితే బంగారు భవిష్యత్తు సాధ్యమని డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. శనివారం స్థానిక సత్యసాయి డిగ్రీ, జూనియర్ కళాశాలల్లో ప్రిన్సిపాల్ ఆదిశేషారెడ్డి ఆధ్వర్యంలో ఫెయిర్‌వెల్‌డే ఘనంగా జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన డీఎస్పీ మాట్లాడుతూ దేశ భవిష్యత్తు యువత చేతిలో ఉందన్నారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎన్నో ఆశలు పెట్టుకుని చదివిస్తున్నారన్న విషయాన్ని విద్యార్థులు మరిచిపోతున్నారని, చదువుపై దృష్టిపెట్టాలన్నారు. అనంతరం నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఏఓ కేశవయ్య, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర్, వినోద్, హుమయూన్, నవీన్, అనీల్ పాల్గొన్నారు.

ఆటోను ఢీకొన్న వాహనాలు

ఇద్దరికి తీవ్రగాయాలు

పెనుకొండ రూరల్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): ఆటోను కారు, ఐచర్‌వాహనం ఢీకొనడంతో ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలోని దుద్దేబండ క్రాస్‌వద్ద జాతీయ రహదారిపై శనివారం చోటు చేసుకుంది. కియా ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు కురుబవాండ్లపల్లి గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ కురుబ నాగరాజు, తన భార్యను ఆటోలో ఎక్కించుకుని పెనుకొండ వైపు వెళ్తున్నాడు. దుద్దేబండ క్రాస్ స్పీడ్ బ్రేకర్ వద్దకు రాగానే ఆటో స్లో చేయడంతో వెనుకే వస్తున్న కారు ఆటోను ఢీకొంది. దాని వెనుక వస్తున్న ఐచర్ వాహనం కారును ఢీకొంది. ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న లావణ్యకు తీవ్రగాయాలుకాగా, మరోమహిళకు స్వల్పగాయాలయ్యాయి. హుటాహుటిన పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి వారిని చికిత్సనిమిత్తం తరలించారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

పద్ధతి మారకుంటే చర్యలు

మున్సిపల్ చైర్మన్ రమేష్



హెచ్ఎం, పీడీలతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): పద్ధతి మార్చుకోవాలని, లేనిపక్షంలో చర్యలు తప్పవని మున్సిపల్ చైర్మన్ రమేష్‌కుమార్ ఎంజీఎం హెచ్ఎం. సామ్రాజ్యం, పీడి సురేష్‌లను హెచ్చరించారు. శనివారం ఆంధ్రజ్యోతిలో వెలువడిన 'బడిలో భోజనం ఆలస్యం' కథనానికి ఆయన స్పందించారు. శనివారం ఉదయం ఇరువురిని తన చాంబర్‌కు పిలిపించుకొని విచారించారు. హెచ్ఎం, పీడీ ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకోవడంతో ఇరువురిని హెచ్చరించారు. ఇంకో మారు ఇలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని ఆగ్రహం వ్యక్తం చేశారు.

సమరభేరిని విజయవంతం చేద్దాం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): బహుజన సమాజ్‌వాదీ పార్టీ ఆధ్వర్యంలో ఈ నెల 11న నిర్వహించనున్న సమరభేరిని విజయవంతం చేద్దామని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు శ్రీరాములు పిలుపునిచ్చారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 11న మహాత్మా జ్యోతిరావు పూలే జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలోని కలెక్టర్ కార్యాలయాల వద్ద రాష్ట్ర అధ్యక్షుడు బందెల గౌతమ్‌కుమార్ ఆదేశాల మేరకు సమరభేరిని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. సమరభేరికి పెద్ద సంఖ్యలో బహుజనులు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో రిటైర్డ్ ఎంఈఓ పెన్నయ్య, శ్రీనివాసులు, దాసరి ఈశ్వరయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

'ఎఫ్‌పీఓ అభివృద్ధికి కృషి చేయండి'

గుడిబండ, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): ఎఫ్‌పీఓ అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఐపీఎం ప్రొఫెసర్ నరేంద్రన్, అసిస్టెంట్ ప్రొఫెసర్ రసూల్ పేర్కొన్నారు. శనివారం గుడిబండ ఎంపీడీఓ కార్యాలయంలో ఐదు మండలాల రైతు మండల సమాఖ్య ప్రతినిధులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఎఫ్‌పీఓ ద్వారా వ్యాపార ప్రణాళిక, బ్రాండింగ్, మార్కెటింగ్ తదితర వాటిపై శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన పంటలను ఎఫ్‌పీఓ ద్వారా నేరుగా కొనుగోలు చేసి రైతులకు అధిక ఆదాయం కల్పించడంతోపాటు ఎఫ్‌పీఓ అభివృద్ధికి కూడా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రైతులు పండించిన పంటలను గ్రేడింగ్ చేసి వాటికి విలువలు జోడించి, వాటిని ప్యాకింగ్ చేసి మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయించే విధంగా ప్రణాళిక రూపొందించాలన్నారు. దీని వలన అధిక లాభం పొందవచ్చని వివరించారు. ప్రతి ఒక్కరు గ్రేడింగ్ చేసి ట్యాగింగ్ చేసి వాటిని విక్రయించాలన్నారు. ఈకార్యక్రమంలో ఏపీఎం తిప్పన్న, సీసీ దేవరాజు, ఎఫ్‌పీఓ లీడర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాబు జగ్జీవన్‌రామ్ జయంతి

సంస్కరణలకు ఆద్యుడు బాబు జగ్జీవన్‌రామ్ అని పలువురు కొనియాడారు. శనివారం ఆయన జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. హరితవిప్లవంలో ఆయన కృషి మరువలేనిదన్నారు.



టీడీపీ కార్యాలయంలో జగ్జీవన్‌రామ్‌కు నివాళులు అర్పిస్తున్న టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి, రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి తదితరులు



హిందూపురం నందిసర్కిల్‌లో నివాళులు అర్పిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లకుంట అంజినప్ప, మున్సిపల్ చైర్మన్ రమేష్ తదితరులు



సోమందేపల్లిలో నివాళులు అర్పిస్తున్న ఇన్‌చార్జి తహసీల్దార్ మారుతి, డీటీ రెడ్డిశేఖర్, వీఆర్‌ఓలు లోకేశ్, నాగరాజు, సోము తదితరులు



సోమందేపల్లిలోని అంబేడ్కర్ కూడలిలో నివాళులు అర్పిస్తున్న దండోరా నాయకులు, మాగేచెరువు సర్పంచ్ నరసింహులు, నాగరాజు, రంగేపల్లి రంగప్ప, గంగాధర్, సూర్యనారాయణ తదితరులు



పెనుకొండలోని సీపీఎం కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న నాయకులు గంగాధర్, ఆరిఫ్, కిష్టప్ప, హబీబ్ తదితరులు



గుడిబండలో నివాళులు అర్పిస్తున్న అధికారులు



అగళి తహసీల్దార్ కార్యాలయంలో నివాళులు అర్పిస్తున్న సీనియర్ అసిస్టెంట్ గురన్న, వీఆర్‌ఓలు నరసింహమూర్తి,లావణ్య తదితరులు

అనుమతి లేకుండా కేంద్రాలు బంద్

గ్రూపులకు మెసేజ్ పంపడంతో తెరవని వైనం



తెరుచుకోని అంగన్‌వాడీ కేంద్రం

హిందూపురం అర్బన్, ఏప్రిల్ 5 (ఆంధ్రజ్యోతి): హిందూపురం ప్రాజెక్టు పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు అనుమతులు లేకుండానే మూతవేశారు. జగ్జీవన్‌రామ్ జయంతి పేరుతో మూసివేశారు. దీంతో శనివారం చిన్నారులకు పౌష్టికాహారం అందలేదు. అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు వారి గ్రూపుల్లో అన్ని జిల్లాల లీడర్లతో మాట్లాడాను.. అందరూ సెలవు తీసుకుంటున్నారు.. మన జిల్లాలో కూడా సెలవు తీసుకోండి.. ఎవరూ సెంటర్లు తెరవద్దు అని ఆయా గ్రూపులకు మెసేజ్ పంపారు. పీడీ, సీడీపీఓలకు చెప్పకుండా అంగన్‌వాడీ కేంద్రాలను మూసివేశారు. స్త్రీ శిశు సంరక్షణ కేంద్ర జేడీ అంగన్‌వాడీ కేంద్రాలకు శనివారం సెలవు లేదని ప్రకటించారు. ఆయన మాటలు కూడా పెడచెవినపెట్టి సెంటర్లు మూతవేశారు.

సెంటర్లు తెరిచే ఉంచాలి

అంగన్‌వాడీ సెంటర్లు తెరిచే ఉంచాలని చెప్పాం. ప్రతి రోజులాగానే అన్ని కార్యక్రమాలు నిర్వహించాలి. పిల్లలకు పౌష్టికాహారం అందించాలి. కేంద్రాలకు సెలవులేదు అని జేడి నుంచి ఆదేశాలు ఉన్నాయి. ఫీడింగ్ డేస్ తక్కువగా ఉన్నందువల్ల సెలవు లేదు. అయితే ప్రతి యేడాది జగ్జీవన్‌రామ్, అంబేడ్కర్ జయంతికి ప్రభుత్వం సెలవు ఇస్తుంది.

- శాంతి, సీడీపీఓ

200 మీటర్ల కేబుల్‌వైర్ చోరీ

గుడిబండ, ఏప్రిల్ 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని తాళికెర పంచాయతీలోని గొల్లహట్టి చెరువు వద్ద ఉన్న తాగునీటి బోరుకు అమర్చిన 200 మీటర్ల కేబుల్ వైర్ చోరీకి గురైందని సర్పంచ్ రంగస్వామి తెలిపారు. తాగునీటి బోరు మరమ్మతుకు గురికావడంతో వాటిని మరమ్మతు చేసేందుకు మోటార్లు బయటకు తీయడంతో అక్కడ వేసిన కేబుల్ వైర్‌ను గుర్తుతెలియని వ్యక్తులు దొంగలించినట్లు సర్పంచు తెలిపారు. ఈవిషయంపై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సర్పంచు తెలిపారు.